నవతెలంగాణ 1

సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్-ములుగు

సోమవారం జులై 29, 2024 www.navatelangana.com

'నవతెలంగాణ' కథనానికి స్పందన..

నవతెలంగాణ-సంగెం

నవతెలంగాణ దినపత్రికలో ఆదివారం 'ఎవరిదీ పాపం... ఎవరికి శాపం..?' అనే శీర్షికతో కాపులకనపర్తి రైతు సేవా సహకార సంఘంలోని 13 గ్రామాల రైతులెవరికీ మొదటి విడతలో రుణమాఫీ రాలేదనే కథనాన్ని ప్రచురించడమైనది. ఈకథనానికి స్పందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సంబంధిత అధికారులను రుణమాఫీ ఎందుకు రాలేదని కారణాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో డీసీవో సంజీవరెడ్డి రైతులకు వివరణ ఇవ్వడం జరిగింది. రెండో విడతలో వాణిజ్య బ్యాంకుల క్రింద ఉన్న రైతు సేవా సహకార సంఘాల రైతులకు కూడా తప్పకుండా రుణమాఫీ వస్తుందని తెలియజేశారు. ఈ విషయమై కాపులకనపర్తి రైతు సేవా సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు 'నవతెలంగాణ' కథనానికి హర్షం వ్యక్తం చేస్తూ, అభినందించారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



నవతెలంగాణ- పర్వతగిరి

బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు వుంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఫెయిల్యూర్ ప్రభుత్వంగా మిగిలిపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు అమలయ్యే పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం లేదన్నారు. ఇలాంటి మోసపూరిత హామీలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు ప్రతి గ్రామం నుండి ఒక 10 మంది బలమైన కార్యకర్తలను తయారు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త కలసికట్టుగా పనిచేసి పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాలో వస్తున్నటువంటి పార్టీ మార్పు పై పుకార్లను మీరెవరు నమ్మవద్దన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కష్టపడే ప్రతి కార్యకర్తని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాది అన్నారు. త్వరలోనే గ్రామ గ్రామాన రివ్యూ మీటింగ్ లు పెట్టి కష్టపడే ప్రతి కార్యకర్తకి తగిన గుర్తింపు ఇస్తూ పార్టీ బలోపేతానికి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకుందామని చెప్పారు. సోషల్ మీడియా పరంగా ప్రతి ఒక్కరూ ముందు ఉండాలని, సోషల్ మీడియ ద్వారా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి మోసపూరిత హామీలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తూ ఉండాలని దిశా నిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులు, అభిమానులు, యువజన సోషల్ మీడియా, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

మహిళా శక్తితో ఆర్థికంగా ఎదగాలి

సెర్ప్ డీఆర్‌డీఏ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ గోలి కొమురయ్య


నవతెలంగాణ-పర్వతగిరి



మహిళలు ప్రభుత్వం ప్రవేశొ ఎట్టిన మహిళా శక్తి పథకాన్ని వినియో గించుకొని వ్యాపార వాణిజ్య రంగాల్లో మరింత ఎదగాలని డీఆర్‌డీఎ-సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య సూచించారు. వర్ధన్నపేట మండలం లోని ఇల్లందలో ఆదివారం గంగ, తుంగభద్ర గ్రామైక్య సంఘాల వార్షిక మహా సభ పద్మశాలి భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో కొమురయ్య పాల్గొని మాట్లాడారు. వీవో ప్రతినిధులు వార్షిక నివేదిక లోని ఆదాయ వ్యయాలు, ఆస్తి బాధ్యతలను చదివి వినిపించారు. ఇప్పటివరకు వార్షిక ఆదాయము రూ. 7,93,539.37 రాగా, 2024-25 సంవత్సరానికి వార్షిక ప్రణాళికను రూపొందించగా సభ్యులందరూ ఆమోదించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ వీవో ల ద్వారా ప్రభుత్వ అందించే సేవలను మహిళలు సద్వినియోగం చేసుకొని మహిళా సాధికార దిశగా ప్రయాణించాలని ఉద్బోధించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు ఎడ్ల అరుణ ఎస్వీఈపీ సీఆర్పీ మహబూబా, బొంతల మౌనిక ప్రతినిధులు మోడం కవిత, స్వప్న ఎల్లమ్మ సుమలత నీరజ ఆకుల, కత్తి స్రవంతిలు మహిళా సంఘాల ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్ పై అవగాహన సదస్సు


నవతెలంగాణ-ఖానాపురం



హృదయ స్పందన కోల్పోయి ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారిని సీపీఆర్ చేసి వారి ప్రాణాలను కాపాడువచ్చని గోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మండలంలోని అశోక్ నగర్ లో గల సైనిక్ స్కూల్ పాఠశాలలో సీపీఆర్ పై పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. హృదయ శ్వాస కోశ పునర్జీవన చర్య ఒక వ్యక్తి యొక్క శ్వాస లేదా హృదయ స్పందన ఆగిపోయినప్పుడు అత్యవసరంగా ప్రాణాల్ని కాపాడే ఒక ప్రక్రియ సీపీఆర్ అని విద్యార్థులకు తెలిపారు. అత్యవసర సమయంలో సీపీఆర్ చేయడం వలన మనిషి ప్రాణాలు కాపాడిన వారమవుతామని వివరించారు. సీపీఆర్ ఏ విధంగా చేయాలనే అంశంపై విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో వారు పాల్గొన్నారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి అరుణ్, డాక్టర్స్ జ్యోతి, రుచిత, రాకేష్, సతీష్, సునీత, హెల్త్ సూపర్వైజర్ రామలింగయ్య, దేవిక, కనుక లక్ష్మి, రాంప్రసాద్ రెడ్డి, భాస్కర్, బద్రు, రమాదేవి, రమ్య, విజయాన్ని తోపాటు పలు ఆశ వర్కర్లు తోపాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 6న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నర్సంపేట



ఎస్సీ వర్గీకరణ సాధనకై ఆగస్టు 6న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయా లని ఎమ్మార్పీ ఎస్టీఎస్ వర ంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ ఈదునూరి యాకయ్య కోరారు. ఆదివారం పట్టణంలో జిల్లా అధ్యక్షులు మైసి శోభన్ అధ్యక్షతన చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ 30 ఏండ్లుగా మాదిగలు తమ న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని ఉద్యమం చేపడుతున్నారన్నారు. 1999లో వర్గీకరణ సాధించుకోగా 2004 రద్దు చేసి తీరని అన్యాయం చేశారని తెలిపారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్ట బద్ధత కల్పించాలని ఉద్యమం కొనసాగుతుందన్నారు. 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జస్టిస్ రామచందర్ రాజ్ కమిషన్, 2007లో కేంద్ర ప్రభుత్వం నియమాకం చేసిన జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ నివేదికల ప్రకారం ఎస్సీ వర్గీకరణ న్యాయ సమ్మతమైనదని చట్ట బద్ధతకై తేల్చిచెప్పిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పిస్తామని నాడు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీనిచ్చి ఇప్పటి వరకు అమలు చేయకుండా మాదిగలను మోసగించిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మోడీ మాదిగల సభకు వచ్చి వర్గీకరణపై కట్టుబడి ఉన్నామని మరోక మారు హామీనిచ్చి ఇప్పటి వరకు పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టకుండా చేతులు దులుపుకోవడం మాదిగలను మరో సారి మోసగించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రధాని మోడీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టి ఎస్సీ వర్గీకరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపెల్లి శ్రీనివాస్ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపడుతున్న దీక్షకు మేధావులు, ప్రజా సంఘాలు, పార్టీలు, మద్దతు తెలుపాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆరెపల్లి బాబు, ఉపాధ్యక్షులు గద్దం రమేష్, జంజాల యూకూబ్, మాదాసి అజయ్, అరవింద్, గోపి, లింగమూర్తి, శివ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

అసెంబ్లీలో చర్చించాలి

నవతెలంగాణ-నెక్కొండ

తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల గుర్తించి వారికై చర్చించి ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని మండల తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు కొత్త సంపత్‌రెడ్డి కోరారు. నెక్కొండలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో 2001 నుంచి 2014 వరకు అనేక పోరాటాలు చేసి రాష్ట్ర స్వప్నం సాధించుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమకారులు ఆర్థికంగా, శారీరకంగా ఉద్యమాలతో కేసులపాలై తీవ్రంగా నష్టపోయామన్నారు. ప్రజాపాలనలో ఉద్యమకారులను గుర్తించి దరఖాస్తులో ఉద్యమకారుల వివరాలు సేకరించి సంతోషమని తమని ఆదుకోవాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, బడ్జెట్‌లో నిధులు కేటాయించి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఉద్యమకారులకు పెన్షన్, గుర్తింపుకార్డులు, హెల్త్‌కార్డులు, ప్రయాణ రాయితీలు కల్పించాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ పర్కాల భిక్షం, అల్లి యాదగిరి, ముగుసు కొమ్మాలు, మెండె కుమారస్వామి, బండారి సారయ్య, మొండె నర్సయ్య, శాడ అనితారెడ్డి, సరితారెడ్డి, ఉమాదేవి, మాదాసు యాకయ్య, కత్తుల సదానందం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే.. ప్రజా ప్రభుత్వం ముందున్న లక్ష్యం..



ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి.

రూ.18 లక్షల 51 వేల 500 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-సంగెం

పేదల సంక్షేమం కోసం వెనకడుగు వేయకుండా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్ని నిధులైనా కేటాయించడానికి సిద్ధంగా ఉందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గతంలో అనారోగ్యానికి గురై చికిత్స పొందిన వివిధ గ్రామాలకు చెందిన 56 మంది సీఎంరిలీఫ్‌ఫండ్ లబ్ధిదారులకు రూ.18 లక్షల 51వేల500 విలువగల చెక్కులను ఆయన ఆదివారం స్థానిక రైతు వేదికలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కాట్రపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ చింతిరెడ్డి తిరుపతిరెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు కెనాల్ లో పడి మృతి చెందగా ఆ కుటుంబానికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుండి వచ్చిన ఎక్స్ గ్రేషియా రూ.రెండు లక్షల ఇరవై వేల విలువగల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎస్సై నరేష్, మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, అధికార ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, జనగాం రమేష్, నాయకులు అంజన్ రావు, సంపత్ రెడ్డి, నరసింహ నాయక్, నాగరాజు, రవికుమార్, రమేష్, రాజు, అనిల్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



తొమ్మిదవ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

దేవేందర్ రావు, నవతెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్

నవతెలంగాణ-గోవిందరావుపేట

నవతెలంగాణ 9వ వార్షికోత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని నవతెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్ దేవేందర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని పస్రా గ్రామంలో సీపీఐ(ఎం) కార్యాలయంలో నవతెలంగాణ ములుగు జిల్లా విలేకర్ల సమావేశం జిల్లా విలేఖరి పిట్టల మధుసూధన్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవేందర్‌రావు హాజరై మాట్లాడారు. గత వార్షికోత్సవాల కంటే గొప్పగా ఘనంగా 9వ వార్షికోత్సవాన్ని నిర్వహించుకోవాలని అందుకు మండల స్థాయి విలేకరులు, జిల్లాస్థాయి విలేకరి, అడ్వర్‌టైజ్‌మెంట్ ఇంచార్జ్ ఒకరికొకరు సమన్వయంతో పనిచేసి ఆదాయ ఓనరు పెంచుకోవాలని సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆయా అంశాలపై ప్రత్యేక స్టోరీలు రూపొందించి పంపించాలని అదేవిధంగా గత బకాయిలను సకాలంలో చెల్లించాలన్నారు. ప్రతి విలేఖరి సూచించిన టార్గెట్‌ను పూర్తి చేసేందుకు అన్వేషణతో ముందుకు సాగాలన్నారు. అనంతరం సీపీఐ(ఎం) పార్టీ జిల్లా నాయకులు పత్రిక జిల్లా ఇంచార్జ్ బీరెడ్డి సాంబశివ మాట్లాడుతూ కార్మిక దృక్పథంతో పార్టీ నిర్మాణ పంథాలో పత్రికలు నిర్వహించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం లక్ష్యంగా పాత్రికేయులు పనిచేస్తూ పత్రిక పురోగతికి కృషి చేయాలన్నారు. సబ్ ఎడిటర్ మహేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో పలు అంశాలపై స్టోరీలు పంపాలని, వార్తలు సకాలంలో పంపి షెడ్యూల్ లో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పొదిల్లా చిట్టిబాబు, ఏడివిటి ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జ్ రంగారావు, గోవిందరావుపేట, తాడ్వాయి, వెంకటాపురం, ఏటూర్‌నాగారం నల్లబెల్లి, దామెర, ఆత్మకూరు మండలాల పాత్రికేయులు పాల్గొన్నారు.

శిధిలావస్థలో ఉన్న ఇండ్లను ఖాళీ చేయాలి

ప్రజలు అధికారులకు సహకరించాలి

కలెక్టర్ దివాకర టీఎస్

నవతెలంగాణ-ములుగు



శిధిలావస్థలో ఉన్న ఇండ్లను ఖాళీ చేయాలని, వర్షాలు, వరదల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం కోరారు. జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షం వల్ల, ఎగువ కురుస్తున్న వర్షాలకు గోదావరి హై లెవెల్ కు పెరుగుతూ తగ్గుతున్నదన్నారు. జిల్లాలో లోతట్టు గ్రామాల ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేస్తూ, శిధిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి, సమీప బంధువుల దగ్గరికి, పునరావాస కేంద్రాల్లోకి, పంపడం జరుగుతుందని, అదేవిధంగా మంగపేట మండలం బ్రహ్మణపల్లి గ్రామ పంచా యతీ పేరకులకుంట హ్యాబిటేషన్, పాండ్ర వెంకటరమణ, భర్త మల్లేశం, గృహము శిధిలావస్థలో ఉన్న విషయం గ్రహించి మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శి ముందస్తుగా ఇంట్లో ఉన్నవారిని, ఇంటిలో ఉన్న విలువైన సామాగ్రిని ఈనెల 25 న సంబంధిత బంధువుల ఇంటికి తరలించడం జరిగిందని, ఈనెల 27 న అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో ఆ ఇంటి గోడ కూలీ పోయిందని అధికారుల సూచనల ప్రకారం ముందస్తుగా ఇంటి నుండి తరలి వచ్చినందున ఎటువంటి ప్రాణ నష్టం గాని ఆస్తి నష్టం గాని జరగలేదని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా శిధిలావస్థలో ఉన్న ఇండ్లను ఖాళీ చేసి అధికారులకు సహకరించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా తక్షణ సహాయం కొరకు ఐటిడిఏ ఏటూరు నాగారంలో కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్. 6309842395. ల్యాండ్ లైన్ నెంబర్ 08717-293246 లకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ, వర్షానికి, జలమయమయ్యేప్రాంతాల సమస్య కు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

జులై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్ట్ అమరుల వారోత్సవాలు..

ఏజెన్సీలో హై అలర్ట్..!

గ్రామాలలో పోలీసుల విస్తృత తనిఖీలు..

నవతెలంగాణ -తాడ్వాయి

మావోయిస్టు అమరుల వారోత్సవాలను విజయవంతం చేయడం కోసం మావోయిస్టు పార్టీ పెద్ద ఎత్తున సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జులై 28 ఆదివారం నుండి ఆగష్టు 3వ తేది వరకు నిర్వహించే వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ (మావోయిస్ట్) జేఎండబ్ల్యూపి ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గతేడాది నుండి వందల మంది పైగా మావోయిస్టులు అసువులు బాసినట్లు తెలిపారు. దీంతో పోలీసులు వారోత్సవాలను భగ్నం చేసేందుకు స్పెషల్ బలగాలతో పెద్ద ఎత్తున మోహరింపజేసి కూంబింగ్ చేపడుతున్నారు. ములుగు జిల్లా జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం సరిహద్దులలో భారీగా బలగాలను మోహరించారు. అందులో భాగంగా ఆదివారం తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మండలంలోని ముండాలతోగు, సార్లమ్మ గుంపు, జలగలంచ గుత్తి కోయ గుడాలను సందర్శించి పరిశీలించారు. కొత్తవారు ఎవరైనా వస్తే సమాచారం అందించాలని అవగాహన కల్పించారు. గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న పలు మండలాలతో పాటు ములుగు జిల్లాలోని తాడ్వాయి, ఏటూర్ నాగారం, మంగపేట, ఏజెన్సీ మండలాల్లో చాపకింద నీరులా మావోయిస్ట్ తమ కొరియర్ వ్యవస్థను పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక వైపు మావోయిస్ట్ నక్సల్స్ చేస్తున్న చర్యలు మరోవైపు నక్సల్ కార్యకలాపాలను నిర్వీర్యం చేసేందుకు పోలీసులు చేపడుతున్న చర్యలతో ఏజెన్సీలోని గిరిజన గ్రామాలలో భయానక వాతావరణం నెలకొంది. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం ములుగు జిల్లా సరిహద్దు దామరతోడు, తాడ్వాయి మండలాల సరిహద్దుల్లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన అశోక్ ఎన్కౌంటర్‌లో మృతి చెందడం ఏజెన్సీ గ్రామాల్లో భయాందోళనలు మొదలయ్యాయి. టెన్షన్- టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోల వారోత్సవాల నేపథ్యంలో దుశ్చర్యలకు పాల్పడే అవకాశముందనే సూచనలతో జిల్లా ఎస్పీ శబరిస్ వాటిని ముందే పసిగట్టి తిప్పి కొట్టాలని పటిష్టమైన భద్రత చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మావోలు ఈ నేపథ్యంలో పోలీసు బలగాలు, పోలీస్‌స్టేషన్‌లు, ప్రభుత్వ కార్యాల యాలపై దాడులు నిర్వహించే అవకాశమున్నందున ఏజెన్సీ వ్యాప్తంగా అప్రమత్తం చేస్తూ, పస్రా సిఐ గద్ద రవీందర్ అధ్వర్యంలో ఏజెన్సీ గ్రామాల్లో స్థానిక ఎస్సై ననిగంటి శ్రీకాంత్ రెడ్డి స్పెషల్ బలగాలతో గ్రామాలలో విస్తృత తనిఖీలు చేపట్టి వచ్చి పోయే వాహనదారులను పరిశీలించి కొత్త వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. మావోయిస్ట్ పార్టీలో కొనసాగిన మాజీలు, లొంగిపోయిన వారిని అదుపులో తీసుకొని విచారించి వ్యక్తిగత పూచీకత్తుపై పంపిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాల యాలు, ఆస్తులకు ఎలాంటి ముప్పు కలు గకుండా ఉండేందుకు మాజీలపై బాధ్యత పెట్టినట్లు తెలుస్తోంది. ఓ వైపు మావోల కదలికలు మరోవైపు పోలీసుల కౌన్సిలింగ్‌లతో మాజీల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి.

టార్గెట్ వ్యక్తులకు అలర్ట్..

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు గట్టి భద్రత చర్యలు చేపడుతున్నారు. అడుగడునా తనిఖీలు చేపడుతూ టార్గెట్ వ్యక్తులను అప్రమత్తం చేస్తున్న పోలీసులు మావోలు చాపకింద నీరులా వ్యవహ రిస్తున్న తీరును పసిగట్టిన పోలిసులు ముందస్తుగానే ఏజెన్సీలో ని మావోల టార్గెట్లను, గతంలో మావోలకు టార్గెట్‌గా మారిన వ్యక్తులను జాగ్రత్తగా ఉండటంతో పాటు



కొద్ది రోజులు సురక్షిత ప్రాంతాల్లో తల దాచుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. ఎలాంటి సంఘటన చోటు చేసుకున్న పోలీసులకు వెంటనే సమాచారం తెలియచేయాలని సూచించినట్లు తెలుస్తుంది. కొంత మంది ప్రజా ప్రతినిధులను సైతం అప్రమత్తం చేసినట్లు తెలుస్తుంది. కొంతమంది ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలుస్తుంది.

అజ్ఞాతం వీడాలి: పస్రా సీఐ గద్ద రవీందర్

మావోయిస్టులు సిద్ధాంతాలతో హింస ద్వారా సాధించేది ఏమి లేదని జన జీవన స్రవంతిలో కలిసి ప్రజలతో ప్రశాంత జీవితం గడపాలని పోలీసు వ్యవస్థ, ప్రభుత్వం నిత్యం పిలుపునిస్తుందన్నారు. అజ్ఞాతాన్ని వీడి అభివృద్ధిలో భాగస్వామి కావాలని పస్రా సీఐ గద్ద రవీందర్, స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి లు పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీలో పని చేసిన ఎంతో మంది మావోయిస్టులు తమ విలువైన జీవితాలను కోల్పోయారు. నిజం తెలుసుకున్న మావోయిస్టులు చాలా మంది పోలీసుల ఎదుట లొంగిపోయి ప్రభుత్వ పరంగా పునరావాస కల్పనతో పొందిన వారందరు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతున్నారన్నారు. స్వచ్ఛందంగా జన జీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో హింస ద్వారా సాధించేది శూన్యమన్నారు. ఈవిషయం తెలుసుకొని అర్థం చేసుకోని శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలని కోరారు. మీరు స్వచ్ఛందంగా లొంగి పోతే ప్రభుత్వ పరంగా రావలసినవన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

అడవులను జల్లెడ పడుతున్న పోలీసులు


నవతెలంగాణ-ఏటూరు నాగారంఐటీడీఏ



ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావొయిస్టు వారోత్సవాల సంస్కరణ సభలు కొనసాగనున్నాయి. వాటిని విఫలం చేసేందుకు ఏటూరునాగారం అడవి ప్రాంతంలోనీ లింగపురం, గోతి కోయ గూడెంలో ఆదివారం ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తూ అడవులను జల్లెడ పడుతున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేస్తున్నారు. ఆదివాసి గూడాలలో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దన్నారు. అనుమానస్పద కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గూడాలలో వారి ఆరోగ్య పరిస్థితి, సౌకర్యాలు. పిల్లలకు విద్య పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గూడాలలో వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ఉన్నట్లయితే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. ఈకార్యక్రమంలో రెండవ ఎస్సై రమేష్, సివిల్ సీఆర్‌పీఎఫ్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

తప్పించుకున్న మావోయిస్టుల కై ముమ్మర గాలింపు

నవతెలంగాణ-గోవిందరావుపేట



గుండాల ప్రాంతంలో పోలీసులు బలగాలకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం విస్తృతంగా పోలీసులు గాలిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం పస్రా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఏ కమలాకర్ సిబ్బందితో కలిసి దోన గుత్తిపోయే గూడెంను సందర్శించారు. ఈసందర్భంగా ఎస్ఐ కమలాకర్ గుత్తి కోయగూడెం ప్రజలతో మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని ఎవరైనా కొత్త వ్యక్తులు తమ గ్రామంకు వస్తే తమకు సమాచారం అందించాలని తెలియచేశారు. చట్ట వ్యతిరేక మైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతే కాకుండా అక్కడి ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలి

సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి ఎండి గఫూర్ పాషా

నవతెలంగాణ-ములుగు

ఎటువంటి షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని, పట్టా పాస్ పుస్తకంతో సంబంధం లేకుండా క్రాప్ లోన్ ఉన్నా ప్రతి రైతు కు మాఫీ వర్తింప చేయాలని, రైతాంగ సమస్యలను పరిష్కారించాలని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి ఎండి గఫూర్ పాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో సీపీఐ(ఎం) పార్టీ ములుగు మండల కమిటీ సమావేశం ఆదివారం కోర్ర రాజు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి ఎండి గఫూర్ పాషా హాజరై మాట్లాడారు. 2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో రూ.72,659 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. ఇందులో రైతుల రూ.2 లక్షల రుణమాఫీకి రూ.26 వేల కోట్లు, రైతు భరోసాకు రూ.15 వేల కోట్లు, రైతుబీమాకు చేసిన కేటాయింపులు ఉన్నాయి. రైతు రుణమాఫీలో కొంత మంది అర్హులకు రుణాలు రద్దు కావడం లేదు. అదేవిధంగా రేషన్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నవారికి రుణమాఫీ వర్తిస్తుందని అదేవిధంగా 12.12.2018 నుండి 9.12.2023 వరకు బాకీ ఉన్న వారికి రుణమాఫీ వర్తించాలి. కానీ అతేదీల మధ్య బాకీలు ఉన్నా వారికి కొందరికి వర్తించడంలేదని, అలాగే ములుగు జిల్లా లోఏజెన్సీ దృష్ట్యా 50 శాతం మందిరైతులకు కూడా పట్టాలు కాలేదని పహాణీల ద్వారానే బ్యాంకుల నుండి పంట రుణాలు తీసుకోవడం జరిగిందన్నారు. కావున ఎలాంటి షరతులు లేకుండా వాస్తవ సాగుదారులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని. వానకాలం పంటల సాగు మొదలయి జూలై మాసం పూర్తవుతున్న ఇప్పటివరకు రైతు భరోసాను విడుదల చేయలేదని వెంటనే విడుదల చేయాలన్నారు. ధరణి లోపాలను సరిచేయడానికి మార్చి 1 నుండి 20 వ తేది వరకు విచారణ జరిపినప్పటికి లోపాలతో ఇబ్బంది పడుతున్నవారికి పరిష్కారం దొరకలేదని ఇంకా అనేకమందికి పట్టాదారు పాస్ పుస్తకాలు రాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. గ్రామ యూనిటీగా తీసుకొని భూ సమస్యను పరిష్కారం చేయాలన్నారు.వరి ధాన్యముకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిడంతో వరి సాగు విస్తీర్ణం పెరిగిందని ప్రభుత్వం సన్నధాన్యానికే బడ్జెట్‌లో పరిమితం చేసింది. 33 రకాల సన్నధాన్యం వంగడాలను విడుదల చేసి వాటికి మాత్రమే బోనస్ ఇస్తామనడం సరికాదన్నారు. బోనస్‌ను సన్నధాన్యంతోపాటు దొడ్డు రకం ధాన్యంకు కూడా వర్తింప చేయాలన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధులను ఖర్చు చేసే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రత్నం ప్రవీణ్, జన్ను దేవేందర్, ఎండీ.సద్దాం హుస్సేన్, కలువల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

గట్లకానిపర్తిలో.. వైభవంగా మహంకాళి బోనాలు

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

నవతెలంగాణ-శాయంపేట



మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం మహంకాళి బోనాల జాతర ఉత్సవాలను గ్రామస్తులు అంగ రంగ వైభవంగా నిర్వహించుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సికింద్రాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో గట్లకానిపర్తిలోనే మహంకాళి మాత బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్‌లు బొమ్మకంటి సాంబయ్య, వైనాల విజయకుమారస్వామి, మాజీ ఎంపీటీసీ బత్తిని రజని సత్యనారాయణలు తెలిపారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబంగా బోనాల ఉత్సవాలు జాతర నిలుస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డిజె సౌండ్స్ నడమ డప్పు చప్పులతో ఊరేగింపుగా మహంకాళి ఆలయానికి వెళ్లి మొక్కలు చెల్లించుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, గ్రామస్తులు బొమ్మకంటి రాజేందర్, శ్రీకాంత్, కుమారస్వామి, సంతోష్, యాదగిరి, కర్ణాకర్, రమేష్, భద్రయ్య, ముత్తయ్య, ఆలయ అర్చకులు అనంతుల రాజేష్, మధుమూర్తి లు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల పరిష్కారంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా సన్మానం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాల సమస్య పరిష్కరిండంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తూ, సమస్యల సాధనకు చర్యలు తీసుకుంటానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా వరంగల్ ప్రెస్‌క్లబ్ కు వచ్చిన ఆయనకు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్, టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు సమస్యలను మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మూడు దశాబ్దాలుగా వరంగల్ జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇండ్ల స్థలాలు, జర్నలిస్టులకు అక్రిడేషన్స్ తో పాటు హెల్త్ కార్డులు అందజేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని, చాలా చోట్ల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారం కొరకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. వరంగల్ జర్నలిస్టుల ఇంటి స్థలాల విషయమై త్వరలోనే స్థానిక శాసనసభ్యులు, మంత్రుల సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్ , దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, పి.వేణుమాధవరావు, ప్రెస్‌క్లబ్, యూనియన్‌ల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు ఏసీరెడ్డి నర్సింహారెడ్డి

సీపీఐ(ఎం) కార్యాలయంలో వర్ధంతి..

నవతెలంగాణ-నయీంనగర్




మాజీఎమ్మెల్యే, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తన జీవితాన్ని ప్రజా శ్రేయస్సు కోసం అంకితం చేసిన ఏసీ రెడ్డి నర్సింహా రెడ్డి 33వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం రామ్ నగర్ లోని సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం, హనుమకొండ లో సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, సీనియర్ నాయకులు సారంపెల్లి వాసుదేవరెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపెల్లి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ. ఏసీ రెడ్డి ప్రజలతో నిత్యం మమేకమై, తన జీవితాన్ని ప్రజా శ్రేయస్సు కోసం అంకితం చేసిన ప్రజానాయకుడన్నారు. తాను మరణించేంత వరకు సాధారణ జీవితాన్ని అనుభవిస్తూ, పేదల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ, ప్రస్తుత తరం కమ్యూనిస్టులకు ఆదర్శనంగా నిలిచారని తెలిపారు . కమ్యూనిస్టు ప్రమాణాలను పాటించడంలో ఏసీరెడ్డి చివరి వరకు కొనసాగించారని. నేడు పనిచేస్తున్న కమ్యూనిస్ట్ కార్యకర్తలందరు ఏసీరెడ్డి జీవితాన్ని ఆదర్శనంగా తీసుకొని పనిచేయాలన్నారు. ఆయన తో కలిసి పనిచేసిన రోజులను వాసుదేవరెడ్డి గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. ప్రభాకర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాగుల రమేష్, గొడుగు వెంకట్, డి.తిరుపతి, కె లింగయ్య, నాయకులు డి.భాను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటు

ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



ప్రైవేట్ జూనియర్ కళాశాల చేస్తున్న విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే కళాశాల అనుమతి పొంది అనేక అనుమతి లేని బ్రాంచిలు ఏర్పరచుకొని విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నటువంటి కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాల ల పై చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారుల దృష్టికి "తీసుకుపోయిన క్రమంలో, ఉలిక్కిపడినటు వంటి ప్రైవేటు జూనియర్ కాలేజీల యజమాన్యాలు విద్యార్థి సంఘాల నాయకులపై అసత్య ఆరోపణలు వేసి విద్యార్థి సంఘాల ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తూ ఆదివారం రోజున యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ఐక్య విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేషన్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈకార్యక్రమంలో . విద్యార్థి సంఘ నాయకులు హకీమ్ నవీద్, మంద నరేష్ ,బొట్ల మనోహర్ లు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి కొన్ని కార్పొరేట్ ,ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు నిజాయితీగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కళాశాలలు నడుపుతున్నారని అనుకుంటే బహిరంగ చర్చకు రావాలని విద్యార్థి సంఘాల నాయకులు సవాల్ విసిరారు.అంతేకాకుండా విద్యార్థి సంఘాల నాయకులకు అసత్య ప్రచారం చేస్తే చూసుకుంటూ ఊరుకోమని వారు హెచ్చరించారు. భవిష్యత్ కార్యాచరణను "ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌బి నాయకులు రోహిత్ , ఏబిఎస్ఎఫ్ నాయకులు హర్షం చరణ్, ఇప్ప భారత్ ప్రణయ్, బిఎస్ఎఫ నాయకులు దాసరి అఖిల్, అరిస్టాటిల్, సజన్, మల్లేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం.. మందులు పంపిణీ

నవతెలంగాణ-కమలాపూర్:



ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఎస్‌జే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బాల జతిన్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎస్‌జే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో నిరుపేదలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి సువర్ణ 400 మంది పేషెంట్లకు ఉచితంగా మందులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్య నిపుణులు హనుమకొండ నుండి డాక్టర్ లావణ్య, క్లినికల్ కార్డియాలజిస్ట్, డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్, క్రిటికల్ కేర్ యూనిట్, డాక్టర్ అనూష గైనకాలజిస్ట్, డాక్టర్ రాకేష్, డాక్టర్ భక్తావర్రాజీ, ఈఎన్టీ సర్జన్ డాక్టర్ రహమాన్ ఖాన్, లాప్రోస్కోపిక్ సర్జన్, వైద్యులు ఈకార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ రాణి, సంధ్య కుమారస్వామి , అండ్ ఆసిఫ్ ఇక్బాల్ టీం , కొత్తకొండ నాగరాజు ఆడెపు శ్రీకాంత్ కొలిపాక నాగరాజు వైనాల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి.

56 మంది లబ్ధిదారులకు రూ.16.9 లక్షల సీఎం రీలిఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ- ఆత్మకూరు





పరకాల నియోజకవర్గం లోని అనారోగ్యానికి గురై చికిత్స పొందిన ఆత్మకూరు, దామెర మండలాల లోని వివిధ గ్రామాలకు చెందిన 56 మంది లబ్ధిదారులకు రూ. 16 లక్షల19500 వేల రూపాయల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరపున బాధ్యతగా నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి పేదవాడికి, పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూన్నామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, సొసైటి చైర్మన్ ఏరుకొండ రవీందర్, మాజీ ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, మాజీ జెడ్పిటిసి కక్కర్ల రాధిక రాజు, మాజీ ఎంపిటిసి అర్షం వరుణ్ గాంధీ, మాజీ సర్పంచ్‌లు పర్వతగిరి రాజు, కంచె రవికుమార్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు పరికరాల వాసు, బరుపట్ల కిరీటి, అధికార ప్రతినిధి ఎంఏ గఫూర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి అలువాల రవి, యూత్ ప్రధాన కార్యదర్శి తనుగుల సందీప్, ఉడుత రాజేందర్, షరీఫ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

పరకాల:

నిరుపేదల అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారంగా 6 గ్యారంటీలను ఖచ్చితంగా ప్రభుత్వం అమలు పరుస్తుందన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను తొమ్మిదేళ్ల టిఆర్ఎస్ పాలనలో అప్పుల రాష్ట్రంగా మిగిల్చిన అవినీతిపరులని ధ్వజమెత్తారు. అంతేకాకుండా అనారోగ్య బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులలో సైతం అవినీతి అక్రమాలకు పాల్పడడం చాలా దారుణమన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం పరకాల మండలంలోని గ్రామాలతో పాటు పట్టణంలోని 71 మంది అనారోగ్య బాధితులకు రూ.18 లక్షల 62 వేల చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో సత్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ షోద అనిత రామకృష్ణ, కౌన్సిలర్లు మడికొండ సంపత్, జయమ్మ, పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ దేవేందర్ రెడ్డి, దేవేందర్ గౌడ్, చంద్రమౌళి, దారణ వేణు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల కురుస్తున్న వర్షాలతో భూపాలపల్లి రోడ్డు లోని చలివాగు బ్రిడ్జి చివరి పిల్లర్ భాగం రహదారి గుంతలు పడి కుంగడంతో అధికారులు, కాంట్రాక్టర్లు తాత్కాలిక మరమ్మత్తు పనులు చేపట్టడంతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. అనంతరం స్థానిక అధికారులతో మళ్లీ మరమ్మత్తులు రాకుండా శాశ్వత పనులు చేపట్టాలని కోరారు.

ఆగస్టు 15 లోపు రూ.రెండు లక్షల రుణమాఫీ..



సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి చెక్కులు అందజేస్తా

పార్టీలకతీతంగా అందరికీ చెక్కుల పంపిణీ

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

నవతెలంగాణ-శాయంపేట

కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్య చికిత్స చేయించుకున్న ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఎంపీఓ రంజిత్ కుమార్ అధ్యక్షతన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కూడా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అందరికీ చెక్కులు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పెండింగ్ లేకుండా చేస్తామన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కక్ష సాధింపు చర్యలు లేకుండా కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తులపై తన సంతకం కోసం లబ్ధిదారులు తిరగాల్సిన అవసరం లేదని, ఎమ్మార్వో కార్యాలయంలో అందజేస్తే కార్యాలయ సిబ్బంది తన సంతకాలు తీసుకుంటారన్నారు. అత్యవసర వైద్య చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రిలో ఎల్ఓసి కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 110 మంది లబ్ధిదారులకు ఎల్ఓసి లు అందజేసినట్లు తెలిపారు. మిగులు రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చినా సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు చెప్పిన మాటను అధికారం చేపట్టగానే అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం అబద్దాల కుటుంబమని విమర్శించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 4వేల ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామన్నారు. రూ.31 వేల 200 కోట్లతో రెండు లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న మౌళిక సదుపాయాలను కల్పిస్తూ సంక్షేమ పథకాలు అందజేస్తూ, ఉద్యోగులకు ప్రతినెలా1వ తేదీన వేతనాలు అందజేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాలలో 82 మందికి రూ.21 లక్ష 94 వేల 500 సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

పద్మశాలి కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి..

శాయంపేట గ్రామంలో పద్మశాలి జనాభా 70 శాతం ఉందని, పద్మశాలి కులస్తుల కోసం కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని మాజీ సర్పంచ్ బాసాని శాంతా రవి, నాయకులు పసునూటి రమేష్ ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, మాజీ సర్పంచులు అబ్బు ప్రకాశ్‌రెడ్డి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, నాయకులు మారపల్లి రవీందర్, బోనపల్లి రఘుపతి రెడ్డి, బాసాని శాంత రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివశక్తి మహంకాళి బోనాల జాతర..

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



శివశక్తి మహంకాళి బోనాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహిస్తుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీ లో ఎంతో వైభవోపేతంగా ఆదివారం జరిగిన శివశక్తి మహంకాళి బోనాల జాతరలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి బోనం సమర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే బోనాల జాతరలో భాగస్వామ్యం అవడం చాలా సంతోషకరమన్నారు. .తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా, బాషా పరిణీతి పరిణమిల్లె విధంగా జాతర వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని సన్మానించారు. ఈకార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయశ్రీ రజాలి, మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి, సీనియర్ నాయకులు సయ్యద్ రజాలి, మొహమ్మద్ అంకుష్, నాయకులు క్రాంతి భరత్, షేక్ అజ్గర్, జక్కుల నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం..

ఎస్సీ విభాగపు మండల అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి

నవతెలంగాణ-పరకాల



దళితుల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎస్సీ మండల కమిటీ అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి అన్నారు .ఆదివారం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కొత్త బడ్జెట్‌లో రూ.33 ,124 కోట్ల నిధులతో దళిత అభివృద్ధి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు .రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగారిగరి ప్రీతం ప్రత్యేక చొరవతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలు ఇచ్చిన మాటకు కట్టుబడి దళితుల అభివృద్ధికి నిధులు కేటాయించడం దళిత వర్గాల అభివృద్ధికి నిదర్శనమ అన్నారు. గత టీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలలో దళితుల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకపోవడం,ఎస్సీ కార్పొరేషన్ సైతం లేకపోవడం చాలా దారుణమన్నారు. ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళితుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం నాయకులతో సంబరాలు చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, నాయకులు ఈర్ల చిన్ని, రవికుమార్, చంగల్, కిషోర్, శ్రీనివాస్, ఒంటేరు పాపుదాల కుమార్, రత్నం, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు చివరికల్లా అందుబాటులోకి నాయీంనగర్ బ్రిడ్జ్..

బ్రిడ్జి నిర్మాణం ద్వారా నగర వాసులకు సమస్యలు తీరుతాయి..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



నయీమ్ నగర్ బ్రిడ్జి (పెద్ద మోరి) పనులు చివరి దశకు చేరుకున్నాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. రెండవ దశ పనులు పూర్తి కావచ్చాయని ఆగస్టు చివరికల్లా రవాణాకు సిద్ధంగా బ్రిడ్జి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికి రెండవ దశ బ్రిడ్జి పనులు కూడా పూర్తి కావచ్చాయని చివరి దశ బ్రిడ్జి పనులు పూర్తయిన క్రమంలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు.బ్రిడ్జ్ నిర్మాణ పనుల్లో నాణ్యత పరమైన ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు.చిరకాల కోరికగా ఉన్న పెద్దమోరి నిర్మాణం ద్వారా ప్రధాన రహదారికి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కలుగుతున్నాయని ఎమ్మెల్యే ఆశభావం వ్యక్తం చేశారు.తేలికపాటి వర్షాలకు సైతం కూరుకుపోతున్న పెద్ద మోరి వలన ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో కోతలకు గురైన ప్రదేశాలను, అక్రమ నిర్మాణాలను కూల్చి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే వర్షాకాలం నాటికి ఎంతటి వర్షభావ పరిస్థితి ఉన్నా కూడా ప్రజా రావాణకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకై ఆగస్టు 6న చలో ఢిల్లీ..



నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

ఎస్సీ వర్గీకరణ కాకుండా ఉండటానికి 2004 నుండి ఇప్పటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ల చిత్తశుద్ధి లోపమే కారణమని, కేంద్రం వైఖరి వల్లనే మాదిగలు ప్రతి సంవత్సరం విద్యా, ఉద్యోగాలు నష్ట పోతున్నారని ఎమ్మార్పీఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఇల్లందుల రాజేష్ ఖన్నా మాదిగ ఆరోపించారు. ఆదివారం హన్మకొండలో జరిగిన ఛలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలు మాటలు చెబుతూ మాదిగలను మభ్యపెడుతున్నారు. ఇగో..అగో అని వర్గీకరణ ఆశ జూపి ఓట్లు వేయించుకున్న తరువాత మొఖం చాటేస్తున్నారన్నారు. బీజేపీ కి మాదిగల ఓట్ల మీద ఉన్న శ్రద్ధ మాదిగల డిమాండు అయిన ఎస్సీ వర్గీకరణ మీద లేదన్నారు. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనె ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరాడు..ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పార్టీలు, ప్రభుత్వం దృష్టికి తేవడానికి జులై ఏడవ తేదిన రాష్ట్రంలో దీక్ష చేసినట్లు గానే.. కేంద్రం దృష్టి కి ఈ అంశాన్ని మరొక్కసారి తేవడంతోపాటు దేశ రాజధానిలో మాదిగల ఆవేదనను వినిపించడానికి ఆగస్ట్ 6వ తేదిన ఢిల్లీలో దీక్ష చేపట్టనున్నామన్నారు. ఈ దీక్షకు సంఘీబావంతెలుపాల్సిందిగా మేధావులు, పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు వర్గీకరణ కొసం పని చేస్తున్న అన్ని సంఘాలను కోరుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తలపెల్లి విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టెపోగుల ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల భాస్కర్, జన్ను సంజీవ్ మధు ఎడెల్లి జోసెఫ్ రూపస్, గాజపాక శ్రీకాంత్, గిన్నారపు అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలను పరిష్కరించాలి



సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య

నవతెలంగాణ-నయీంనగర్

ఆశ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారికి ఫిక్స్‌డ్ వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్ లో ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.రాజేశ్వరి అధ్యక్షతన విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టి.ఉప్పలయ్య మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆశాలకు వేతనాలు పెంచడంలో, వారిని కార్మికులుగా గుర్తించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. పారితోషకాలు కాకుండా ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం కార్మిక చట్టాలకు అనుగుణంగా ఇవ్వాలని కోరారు. పారితోషికంలో లేని పనులను ఆశాలతో చేయించరాదని ఆయన డిమాండ్ చేశారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కార్మిక చట్టాలను అమలు చేయకపోతే ఇంకెవరు అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారానే హక్కులు రక్షించబడతాయని ఆశా కార్యకర్తలందరూ కూడా ఐక్యంగా తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, పాషా యూనియన్ నాయకులు యాకూబీ, సిహెచ్ శ్రీవాణి, మాచర్ల రజిత, కె.కల్పన, జే శ్వేత, బైరి శోభ పొదిలి, ఇ.శోభ, వేల్పుల రమాదేవి, సూర్యకళ, పి సరిత, జి పద్మలతోపాటు ఆశాలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

నవతెలంగాణ-ఎల్కతుర్తి



మండలంలోని జిలుగుల గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో, ఆదివారం 1995-96 పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఆటపాటలతో గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పాద పూజ చేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్‌రెడ్డి, పశుపతిరావు, సత్యనారాయణ, రాజ్ మహమ్మద్, మల్లయ్య, బాబు, స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల గట్టన్న



నవతెలంగాణ - భూపాలపల్లి టౌన్

ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా కమిటీ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల గట్టన అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు ల్యాదల్ల గట్టన్న ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలని ప్రొఫెసర్ జయ శంకర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గట్టన్న మాట్లాడుతూ.. ఉద్యమకారులు లేనిదే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగేది కాదని అన్నారు. ఉద్యమ కాలంలో పేద ప్రజలు ఉద్యమ సమయంలో అనేక పోలీస్ కేసులు పాలై రాష్ట్రాన్ని సాధించడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను మర్చిపోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం ఉద్యమ కాలంలో ఎఫ్ఐఆర్ నమోదు అయిన ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం పెన్షన్ భవిష్యత్తు తరాలు గుర్తుంచుకునే విధంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఇందుకు మంత్రులు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వావిళ్ళ రమేష్, రాజేశ్వరి, నరసయ్య, శారద, పుష్ప, లత, ఎండి షరీఫ, వాణి, తదితరులు పాల్గొన్నారు

మహనీయుల చిత్ర పటాలు ఇంటింటికి చేర్చడమే లక్ష్యం

ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్



నవతెలంగాణ-మల్హర్‌రావు

మహనీయుల చిత్రపటాలను, వారి జీవిత చరిత్ర గ్రంథాలను ప్రతి ఇంటింటా చేర్చడమే అల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ 542 లక్ష్యమని సొసైటీ జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ అన్నారు.ఆదివారం మండలంలోని కొయ్యుర్ ప్రెస్ క్లబ్‌లో సొసైటీ కాళేశ్వరం జోనల్ యూత్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్ అధ్యక్షతన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబెద్కర్ చిత్ర పటాల ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. లింగమల్ల శంకర్ దంపతులు హాజరై చిత్రపటాలను పంపిణీ చేసి వారు మాట్లాడారు. తమ సొసైటీ ఆధ్వర్యంలో మహనీయుల జయంతోత్సవాలు నిర్వహిస్తూ వారి చరిత్ర గ్రంథాలు, చిత్రపటాలు పంపిణీ చేయడం, పేద విద్యార్థులకు చేయుతనివ్వడమే ముఖ్య ఉద్దేశ్యంగా వివరించారు. కార్యక్రమంలో సొసైటీ జోనల్ అధికారప్రతినిది లింగమల్ల సునీల్, భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర సారయ్య, జిల్లా మహిళ అధ్యక్షురాలు కొండ రాజమ్మకాటారం డివిజన్ అధ్యక్షురాలు కొండూరి మమత, కాటారం డివిజన్ యూత్ అధ్యక్షుడు వేల్పుల మహేందర్, సభ్యులు గౌస్, వెంకటేష్, లక్ష్మన్, వినయ్ పాల్గొన్నారు.

ఉద్యమ కారుల హామీపై ప్రకటన చేయాలి : టీయూఎఫ్

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఈ అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మానిఫేస్టో కమిటీ చైర్మన్, ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కేబినెట్ మంత్రివర్గం చర్చించి హామీపై ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. మహనీయుల విగ్రహాలకు వినతిపత్రాలు అందజేయాలని టీయూఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం మండల కేంద్రమైన తాడిచర్ల లోని మహాత్మ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అభయహస్తం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యమ కారుల గుర్తింపు, 250 గజాల ఇంటి స్థలం, ఫింఛన్, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి జార్ఖండ్ తరహాలో ఉద్యమ కారులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టియూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలోజు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షు బోయిని రాజయ్య యాదవ్, మండల అధ్యక్షులు ముడితనపెల్లి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బూడిద సతీష్, ఉపాధ్యక్షులు చొప్పరి రాజు, జిల్లా అధ్యక్షురాలు గడ్డం సమ్మక్క, టియూఎఫ్ రాష్ట్ర నాయకురాలు దుబాసి పార్వతి, నాయకులు జునగరి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై సస్పెండ్‌ను వెనక్కి తీసుకోవాలి : పీఆర్‌టీయూ

నవతెలంగాణ-మహాదేవపూర్

ఖమ్మం జిల్లాలోని పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పని చేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయురాలు దిగుమర్తి శిరీష విద్యార్తుల జుట్టు కత్తిరించారనే నెపంతో సస్పెన్షన్ గూరయ్యారని, సస్పెన్షన్ వెనక్కి తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ నేత కోరారు. మండలంలో ఆదివారం నిర్వహించిన పీఆర్టీయూ తెలంగాణ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను గాడిలో పెట్టాలనే క్రమంలో ఘటన జరిగిందని అన్నారు. ఆమెను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు ఎల్కటి శరత్, అశోక్, అనిల్,శ్యామ్,రామకష్ణ, శ్రీనివాస్,కుమారస్వామి, రాజు కుమార్, మహేష్, శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాలనండి ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ కోసం మాదిగల పోరాటం కొనసాగిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. బీజేపీ ప్రభుత్వం 2014 ఎన్నికల ముందు వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ పూర్తి చేస్తామని 3 సార్లు కేంద్రంలో అధికారంలో ఉన్న నిమ్మకు నీరెత్తినట్లు కాలయాపన చేస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండ కడుతూ ఎమ్మార్పీఎస్ టీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద దీక్షను తలపెట్టరాని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు పెండెల దేవరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల సతీష్ , జిల్లా కార్యదర్శి బచ్చుల చిరంజీవి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శీలపాక హరీష్, మలహార్ మండల అధ్యక్షులు మంత్రి రాజబాబు, మండల నాయకులు మంచినీళ్ళ వైకుంఠం, కొయ్యడ భద్రయ్య, రేణుకుంట్ల రాజు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం వద్ద తగ్గిన గోదావరి..

- మేడిగడ్డ బ్యారేజ్ ఔట్‌ఫ్లో 4,06,510 క్యూసెక్కులు

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీ వద్ద వరద తగ్గుముఖం పట్టింది బ్యారేజ్ లోకి 4లక్షల6వేల510 క్యూసెక్కుల నీరు రావడంతో అంతే మొత్తంలో 85 గేట్లు ఎత్తివేసి దిగవకు ఇంజినీర్ అధికారులు వదిలిపెట్టారు. ఆదివారం సాయంత్రం వరకు కాళేశ్వరం వరద 8.820మీటర్లకు చేరుకుంది. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం పూర్తి సామర్థ్యం 6.17టీఎంసీలు కాగా ఈ సంవత్సరం మేడిగడ్డ బ్యారేజీ పనులు పూర్తిగా కాకపోవడంతో సేఫ్టీ అధికారులు ఆదేశాల వరకు పూర్తిగా 85 గేట్లు ఎత్తివేయడం జరిగిందని సంబంధిత అధికారులు తెలిపారు.

ఆదమరిస్తే.. అంతే..!

- అధ్వానంగా పలుగుల రోడ్డు

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలంలోని మద్దులపల్లి నుండి పలుగుల వరకు ఉన్న రోడ్డు ఏటా వర్షాకాలం బురదమయమవుతోంది. కనీసం మోటర్ సైకిల్ కూడా వెళ్లే పరిస్థితి లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో ఇసుక క్వారీల వల్ల ప్రభుత్వానికి కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ రోడ్డు మంజూరు చేయట్లేదని ఆరోపిస్తున్నారు. ఇటు టీఎస్ఎండిసి అధికారులకు, కలెక్టర్‌కు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇసుక లారీల వల్ల రోడ్డు పూర్తిగా చెడిపోవడంతో మహదేవపూర్ రావాలంటే ఇబ్బందులు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బడి పిల్లలను పాఠశాలలకు పంపే క్రమంలో బురదలో వాహనాలు దిగిపోతున్నాయని అంటున్నారు. వారం రోజుల క్రితం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వచ్చి రోడ్డు పరిస్థితి చూసి వెళ్లిపోయారని, గ్రామస్తులు కూడా రోడ్డు గురించి



వివరించారని, ప్రభుత్వం వెంటనే బీటీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేదంటే గ్రామంలో ఇసుక క్వారీలు బందు పెడతామని హెచ్చరిస్తున్నారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలి

- సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను విజయవంతం చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు
- జిల్లా కేంద్రంలో గోడపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-భూపాలపల్లి



బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలని, సింగరేణి పరిరక్షణ కొరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బస్సు యాత్ర కూడా పత్రికను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ఆపాలని, శ్రావణ పెల్లి బొగ్గు బు బ్లాక్‌ను సింగరేణి అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న బెల్లంపల్లిలో సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర ప్రారంభం కానుందన్నారు. ఈ బస్సు యాత్రను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారని తెలిపారు. ఈ బస్సు యాత్రలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు భూపాల్, పార్టీ రాష్ట్ర నాయకులు ఆశయ ఉంటారన్నారు. సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర ఆగస్టు 1న రాత్రి భూపాలపల్లికి చేరుకుంటుందని, ఆగస్టు 2న సింగరేణి గనులు , భూపాలపల్లి పట్టణంలోని కాలనీలలో బస్సు యాత్ర పర్యటిస్తుందన్నారు. సాయంత్రం 4గంటలకు హనుమాన్ గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో నాయకులు మాట్లాడతారని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కార్ల మార్క్స్ కాలనీలో కార్నర్ మీటింగ్ ఉంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గు గనులను వేలం, దేశ సహజ సంపదను కార్పొరేటర్ శక్తులకు అప్పగించబోతుందన్నారు. సింగరేణి ప్రాంతంలోని శ్రావణ పెల్లి బొగ్గు బ్లాక్ ను వేలంలో పెట్టింది. సింగరేణి కూడా ప్రైవేటు సంస్థలతో పోటీపడాలని కేంద్ర ప్రభుత్వం అంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. తెలంగాణలోని బొగ్గు గనులను వేలం ఆపాలని, సింగరేణి ప్రాంతంలో ఉండే బొగ్గు బ్లాకులను సింగరేణికే అప్పగించాలని అన్నారు. బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్, గోదావరి నది పరివాహక ప్రాంతంలో సింగరేణి సంస్థల సొంత ఖర్చులతో అనేక ప్రాంతాల్లో సర్వే చేసి బొగ్గు బాక్‌లను గుర్తించి బొగ్గు ఉత్పత్తి చేస్తుందన్నారు. సహజంగానే శ్రావణ పెల్లి బహుళ కూడా సింగరేణికే తవ్వకాలకు ఇవ్వాలి. కానీ మోడీ ప్రభుత్వం ప్రవేటు వాళ్లకు అప్పగించే ప్రయత్నంలో భాగంగానే వేలం పాట వేస్తుందన్నారు. సింగరేణి గనులు తెలంగాణకు కొంగుబంగారం, కార్మికుల కష్టంతో సిరులు కురిపిస్తుందన్నారు. కార్మికులు నిత్యం గనుల్లో బలిదానాలు చేస్తున్నారు. పర్మినెంట్ కాంట్రాక్టు 70 వేల మంది రక్తాన్ని ధారబోస్తున్నారన్నారు. అధికారులు కూడా అనేక రకాలుగా శ్రమ చేస్తున్నారు. తద్వారా సింగరేణి కి లాభాలు వస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి డివిడెంట్ల రూపంలో 49 వేల కోట్ల రూపాయలు సింగరేణి చెల్లించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి 30వేల కోట్లు సింగరేణి సింగరేణి ఇచ్చిందని, రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో బీజేపీకి 8 ఎమ్మెల్యేల సీట్లు ఇచ్చారని తెలిపారు. తెలంగాణ నుండే బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఉన్నారని, హైదరాబాదులో కిషన్ రెడ్డి వేలం వేయటం అత్యంత దుర్మార్గం అన్నారు. ఆగస్టు 2న జరిగే సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వెలిశెట్టి రాజయ్య, గడప శేఖర్, మేకల మహేందర్, ఆకుల రవి, రాజశేఖర్, ఇక బిక్షపతి, దుర్గంరాజు, గట్టు శంకర్, దువ్వల భారతి, దొడ్ల శారద, రోజా, రజిత, శ్రీదేవి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మావోయిస్టుల వారోత్సవ సందర్భంగా

విస్తృతంగా తనిఖీలు

నవతెలంగాణ-మహదేవపూర్

మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. చార్ మంజూర్ 1972లో జులై 28న చనిపోవడంతో అప్పటినుండి ప్రతి సంవత్సరం మావోయిస్టులు జులై 28 నుండి ఆగస్టు 3 వరకు వారోత్సవాలు జరుపుకుంటూ వస్తున్నారు. ఈ సంవత్సరం దేశంలో 200మంది మావోయిస్టులు వివిధ సంఘటనలో చనిపోవడం జరిగింది. అందులో భాగంగా ఇటు అమరవీరుల వారోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టులు పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా మహారాష్ట్ర చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు ఆనుకుని ఉన్న భూపాలపల్లి మంచిర్యాల్ కొమరం ఆసీఫాబాద్ భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి సంఘటనలు జరకుండా విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ మధ్యకాలంలో భద్రాది కొత్తగూడెం జిల్లా ములుగు జిల్లాలకు 15మంది మావోయిస్టుల బృందం రావడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు అడవి ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. పోలీసులకు మావోయిస్టులు ఎదురుపడి పోలీసులకు మావోయిస్టులకు ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు చనిపోయిన సంఘటన చోటుచేసుకుంది. అటవీ ప్రాంతంలో బాంబులు పెట్టి అమాయక ప్రజలను మావోయిస్టు చంపుతున్నారని పోలీసులు మండి పడుతున్నారు. మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా మావో యిస్టులు ఉనికి కోసం పట్టు కోసం ఏదో ఒక సంఘటన జరుపుతారని సమాచారం కోసం పోలీసులు అప్రమత్తమై కాటారం డీఎస్పి రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మహాదేవపూర్ సీఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో మహాదేవపూర్, కాళేశ్వరం, పలిమెల ఎస్ఐలు కే పవన్ కుమార్, చక్రపాణి, థామస్ రెడ్డిలు కాళేశ్వరం చెక్‌పోస్ట్ వద్ద సీఐ రామచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. వాహనాల తనిఖీలు చేపట్టి అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. మేడిగడ్డ బ్యారేజీ మహాదేవపూర్ క్రాస్ రోడ్, సూరారం వద్ద ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. పలివెల ఎస్సై థామస్ రెడ్డి దమ్మురు నీలంపల్లి, ఆయా గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు.

మాజీ సైనికుల కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



మాజీ సైనికుల కుటుంబాలకు అండగా ఉంటామని దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర జవాన్‌ల ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అమర్ జవాన్ స్తూపం వద్ద కార్గిల్ విజయ్ దివాస్ సిల్వర్ జూబ్లీ వేడుకలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బేతోజు మురళీకష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై అమర్ జవాన్ స్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర జవాన్ల కుటుంబాలకు అండగా ఉంటూ నిరుపేద మాజీ సైనిక కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బెతుజు మురళీకష్ణ, ఉపాధ్యక్షులు అభిషేక్ గుప్తా, అఖిలభారతపూర్వ సైనికుల సేవా పరిషత్ జనరల్ సెక్రెటరీ పి సత్యనారాయణ స్వామి, సభ్యులు కే జనార్దన్‌రెడ్డి, మాలోతు ఆశ, బండ రాధమ్మ టిపిసిసి సభ్యులు చల్లూరి మధు, పట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, కౌన్సిలర్లు సిరుపా అనిల్, దాట్ల శ్రీనివాస్, ముంజల రవీందర్, పిల్లలమర్రి నారాయణ, కాంగ్రెస్ నాయకులు బుర్ర కొమురయ్య, పిప్పల రాజేందర్, తోట రంజిత్, యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింల ఐక్యతకు పీరీల పండుగ నిదర్శనం

- ఎమ్మెల్యే జీఎస్సార్

నవతెలంగాణ-టేకుమట్ల



హిందూ ముస్లింల ఐక్యతకు పీరీల జాతర నిదర్శనమని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని రామకిష్టపూర్-వి లో జరుగుతున్న పీరీల జాతలో ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతనం నుండి గ్రామాలలో పట్టణాలలో హిందూ ముస్లింలు అన్నదమ్ముల్ల ఈ పండుగను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలానే ఉంటూ అందరూ కలిసి మెలిసి ఈజాతరను జరుపుకోవాలని అన్నారు.

బ్రిడ్జి పునర్నిర్మాణ పనులను పరిశీలన

రాఘవరెడ్డి పేట-టేకుమట్ల బ్రిడ్జి పునర్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే జీఎస్సార్ ఆదివారం పరిశీలించారు. బ్రిడ్జి పనులను నాణ్యతతో తొందరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. బ్రిడ్జి లేకపోవడం వల్ల వాగవతల్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి మొగుళ్లపల్లి మీదుగా రావాల్సి వస్తున్నదన్నారు. పనుల్లో జాప్యం చేయకుండా తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్, నాయకులు కత్తి సంపత్, చిరంజీవి, వంగ నరేష్, రాజిరెడ్డి, నూనేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ -భూపాలపల్లి టౌన్



కురుమ సంఘం భూపాలపల్లి మండల కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నికు న్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీరప్ప గుడి ఆవరణంలో కురుమ సంఘం ఎన్నికల కో ఆర్డినేటర్లు కోరే సుధాకర్ కురుమ, అమత అశోక్ కురుమ ఆధ్వర్యంలో నూతన కమిటి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు , కుల పెద్దగా : కోరే కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా అల్లి చేరాలు, ఉపాధ్య క్షులుగా మధిర కొమురయ్య, కోరే రాంబాబు, కంకల మధు కోశాధికారి గా కంచు రాజేందర్, సలహాదారులుగా బండి మల్లయ్య నరిగే సమ్మయ్య, బుర్రి కుమార స్వామి, గుంటి గట్టయ్య, విరాముష్టి కొమురయ్యసహాయ కార్యదర్శులు గా సప్ప కష్ణమూర్తి, కంబాల రాజయ్య, ఎగ్గటి కుమారస్వామి, ఎగ్గటి రమేష్,గోవిందుల తిరుపతి, బండారి ఓం ప్రకాష్, ప్రచార కార్యదర్శిలుగా. అమత అశోక్, కేంచు లక్ష్మన్ కమిటి సభ్యులుగా 9 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల సంఘ అభివృద్ధికి పాటుపడుతామని తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షాలకు బ్రేక్...

భూపాలపల్లి ఏరియా సింగరేణికి సుమారు 18 కోట్ల నష్టం

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గత వారం పది రోజులు గా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు ఆదివారం బ్రేక్ పడింది. వారం రోజులుగా జోరుగా కురు స్తున్న వానలతో జిల్లా తడిసి ము ద్దయింది. సూర్యుని జాడలేక లేక, ఎండ తగలక విలవిలలాడిన జిల్లా ప్రజలు వరుణుడు కాస్త శాంతించడంతో ఊపిరి పీల్చుకున్నారు. జయశం కర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణిలో రెండు ఓపెన్ కాస్ట్ గనులు ఉండగా వర్షం కారణంతో బొగ్గు ఉత్పత్తి స్తంభించింది. రోజుకు ఓసి టు ఉత్పత్తి లక్ష్యం 4 వేల టన్నులు , ఓసి -3 లో 4,200 టన్నులు కాగా మొత్తం రెండు ఓసి గనులలో 8,200 టన్నులు బొగ్గు ఉత్పత్తి కావలసి ఉండగా , వర్షం కారణంతో పూర్తిగా స్తంభించింది. ఒక టన్ను బొగ్గు విలువ 2,800 రూపాయలు. తద్వారా సింగరేణికి భూపాలపల్లి ఏరియాలో సుమారు 18 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు సమాచారం.

అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహొత్సవం





నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహొత్సవం కార్యక్రమంలో భాగంగా కొయ్యుర్ రేంజ్ అటవీశాఖ అధికారులు ఆధ్వర్యంలో వనమహొత్సవం కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జామ, నేరేడు, సీతాఫలం, చామంతి తదితర రకాల మొక్కలు నాటారు. అనంతరం ఇంటికి 5 మొక్కలు పంపిణీ చేశారు. నాటిన ప్రతి మొక్కకు సంరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యుర్ డిప్యూటీ రేంజర్ కొమురయ్య, సెక్షన్ అధికారులు, బిట్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకొరిగిన ఇల్లు

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండలంలోని కుదురుపల్లి గ్రామంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గోగుల తిరుపతికి చెందిన ఇల్లు ఆదివారం కూలిపోయినట్టు బాధితుడు తెలిపారు. ఇంట్లో ఇతర సామాను కూడా తడిసినట్టు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తమకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి, ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

తాటి చెట్టు పైనుండి పడి గీతా కార్మికుడికి గాయాలు

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రానికి చెందిన గడ్డమీది సమ్మయ్య (52) ఆదివారం తాటి చెట్టు మీది నుండి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం సమ్మయ్య తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాళ్లకు ఉన్న గుయ్యి జారడంతో తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడ్డ సమ్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

4

జనగామ

సోమవారం జులై 29, 2024 | www.navatelangana.com

యువజన కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల సమావేశం



నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

డిసిసి అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశంతో ఆదివారం స్థానిక డిసిసి కార్యాలయంలో యువజన కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల ముఖ్య సమావేశం జరిగింది. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రానున్న యూత్ కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో పోటీల్లో ఉన్న అభ్యర్థులందరూ ఓటింగ్ (ఆగస్టు 5 నుండి సెప్టెంబరు 5 వరకు) లో ఏ విధంగా పాల్గొనాలో తెలిపారు. అధిష్టానానికి అనుగుణంగా అందరూ కలిసికట్టుగా ఒకే ప్యానెల్ గా ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. యువజన కాంగ్రెస్ బలోపేతానికి జిల్లాలో తీసుకోవలసిన చర్యల గురించి కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కష్ట, జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిట్యాల కమలాకర్ యాదవ్, ఉపాధ్యక్షులు సంతోష్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి, యూత్ కాంగ్రెస్ నాయకులు కమలాకర్, శ్రీకాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయించమంటే అక్రమ కేసులా ?

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ బిక్షం



నవతెలంగాణ-జనగామ

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించమంటే విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించడం ఏంటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ప్రయాసంగాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమావేశంలో ధర్మభిక్షం పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం నిధులు తగ్గించిందన్నారు. ఇందుకు నిరసనగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు పిలుపునివ్వగా జనగామ జిల్లా కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారని తెలిపారు. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోవని శాంతియుతంగా నిరసన తెలిపినందుకు అక్రమంగా కేసులు పెట్టడం ప్రభుత్వ నిర్బంధ చర్యకు నిదర్శనం అన్నారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శిపై పెట్టిన అక్రమ కేసులు బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పొదల లవ కుమార్, సాగర్, మురళి కృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలి

కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, దేవదానం



నవతెలంగాణ-జనగామ

జిల్లావ్యాప్తంగా బీసీ హాస్టల్స్ సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు బొట్ల శేఖర్, తూటి దేవదానం డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా హాస్టల్ అధ్యయన యాత్రలో భాగంగా ఆదివారం జనగామ మండలం పెంబర్తి గ్రామంలో బీసీ హాస్టల్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు స్కూలు యూనిఫాం, నోట్ బుక్స్ విద్యార్థులకు ఇవ్వలేదన్నారు. తాగడానికి ప్యూరిఫైయర్‌వాటర్ లేక ట్యాంక్ వాటర్ తాగుతున్నారని తెలిపారు. సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గద్దం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు వెలకట్ట లేనివి

డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య



నవతెలంగాణ-జనగామ

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల వల్ల లభించే సంతృప్తి వెలకట్ట లేమని 320ఎఫ్ ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ కొడి చంద్రశేఖర ఆర్య అన్నా రు. శనివారం రాత్రి ఓం సాయి ఫ్యాంక్షన్ హాల్‌లో జరిగిన లయన్స్ క్లబ్ జనగామ బిబాయిజ్ నూతన కార్యవర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఇన్స్టలేషన్ అధికారిగా పాల్గొని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు ఎల్ కిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థాకి క్లబ్ జిల్లాలో ఆదర్శ క్లబ్‌గా రాణించాలని ఆకాంక్షించారు. క్లబ్ తృతీయ కార్యవర్గం అధ్యక్షునిగా డాక్టర్ డి. శివశంకర్ రావ్, కార్యదర్శిగా ఎం బాలకృష్ణ, కోశాధికారిగా కే అనిల్ కుమార్ కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి సభ్యుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పూర్వ జిల్లా గవర్నర్ మల్టిపుల్ జిల్లా మ్యాగజైన్ విభాగం చైర్మన్ కన్న పరశురాములు పాల్గొని మాట్లాడారు. సేవాభిలాషులందరు తమ సంస్థలో చేరాలని కోరారు. క్లబ్ చార్టర్ అధ్యక్షుడు బాల భరద్వాజ, రీజియన్ చైర్మన్ కలువల భాస్కర్ రెడ్డి, జోన్ చైర్మన్ శ్రీభాష్యం రఘు, జిల్లా నాయకులు కుర్రేముల యాదగిరి, పబ్బ చంద్రశేఖర్, శ్రీరాం శ్రీనివాస్, కృష్ణ జీవన్ బజాజ్, ప్రమోద్‌కుమార్, జయహరి, రీజియన్ కార్యదర్శి కన్న శ్రీనివాసు, జనగామ అధ్యక్షుడు వై సంజీవ రెడ్డి, కార్యక్రమ వ్యాఖ్యాత అల్లాడి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

లయన్స్ క్లబ్ జనగామ బి బాయ్స్ అధ్యక్షుడిగా డాక్టర్ డి శివశంకర్ రావు, ఉపాధ్యక్షులుగా ఎల్ కిషోర్, కే బాలరాజు, కార్యదర్శిగా ఎం బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వై రాము, కోశాధికారిగా కే అనిల్ కుమార్ మార్కెటింగ్ చైర్మన్‌గా బి ప్రమోద్‌కుమార్ రెడ్డి , క్లబ్ అడ్మినిస్ట్రేటర్ గా కన్నా శ్రీనివాస్, జీఎంటి చైర్మన్గా బుక్క బాల భరద్వాజ్, జీఎస్టి చైర్మన్గా కె రాజు, జీ ఈ టి చైర్మన్గా ఎం లింగాజీ, లయన్స్ క్వెస్ట్ చైర్మన్గా వై . రోషన్ ఐటీ చైర్మన్గా కందుల శ్రీకాంత్, క్లబ్ పిఆర్‌ఓగా నాగరాజు డైరెక్టర్లుగా పి ప్రవీణ్ రెడ్డి పి శ్రీశైలంను ఎన్నుకున్నారు.

'చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి'

గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ)

నవతెలంగాణ-బచ్చన్నపేట

గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమ స్యల పరిష్కారానికి ఈనెల 30న చేపట్టు చలో హైదరాబాద్ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు చంచు విజేందర్, వెంకటేష్ పిలుపునిచ్చారు. నిరసన కా ర్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం స్థానికంగా వారు విలేకర్లతో మాట్లా డారు. గ్రామ పంచాయతీలో పనిచే స్తున్న కార్మికు లకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని డి మాండ్ చేశారు. జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పాత కేటగిరీలో అన్నింటిని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వీటన్నిటిని సాధించుకోవడం కోసం జూలై 30న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఏసిరెడ్డి నరసింహ్మారెడ్డి 33వర్ధంతి

- **భారీ ప్రదర్శన ర్యాలీ**



నవతెలంగాణ-జనగామ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మాజీ ఎమ్మెల్యే కేసిరెడ్డి నరసింహారెడ్డి 33వ వర్ధంతి ఉత్తేజ పూరితంగా నిర్వహించారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వర్ధంతి సందర్భంగా స్థానిక క్రిస్టియన్ గ్రౌండ్ నుండి ఆర్టీసీ చౌరస్తా నెహ్రూ పార్క్ మీదుగా ఎర్రసైన్యం కవాతుతో భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఎర్రజెండా రెపరెపలతో జనగామ పట్టణం అంతా ఎరుపుమయం అయింది. ఆట పాటలతో పార్టీ శ్రేణులు, కళాకారులతో రోడ్లు అన్నీ జన సంద్రంగా మారాయి. ఎర్ర జెండాల చేత పూని ఏసిరెడ్డి నరసింహారెడ్డి ఆశయాలు కొనసాగిస్తామంటూ పార్టీ శ్రేణులు ప్రదర్శన ర్యాలీలో కదం తొక్కారు. కళాకారుల డప్పుసప్పులు వాయిద్యాలు, ప్రదర్శనలు ప్రజలను ఆకర్షించాయి. కవాతుగా కదిలిన ప్రదర్శన ర్యాలీ... వర్ధంతి సభాస్థలి వరకు కొనసాగింది. వర్ధంతి సభలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 3వ తరగతి... పునరాలోచించాలి

- **ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**



నవతెలంగాణ-జనగామ

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 3వ తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయం సరికాదని, పునరాలోచించాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సూచించారు. జనగామ జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆదివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం చంద్రశేఖర్‌రావు అధ్యక్షత జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రాథమిక విద్య బలోపేతానికి పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలన్నారు. అందుకు ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటూ ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో అదనంగా పాఠశాలలను నూతనంగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మధ్య జరిగిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేసినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నానని అన్నారు. పాఠశాల పర్యవేక్షణకు అవసరమయ్యే ఎంఈఓ పోస్టులను, డైట్ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో విద్యారంగానికి గత ప్రభుత్వం కన్నా పెంపు చేసినప్పటికీ, ఇది సరిపోదు అన్నారు. ఇంకా పెంపు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బడులు ఉంటేనే మనం ఉంటామనే విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కృష్ణ, బచ్చన్నపేట్ ప్రధాన కార్యదర్శి కనకయ్య, నర్మెట్ట అధ్యక్షులు ఆగయ్య, లింగాల ఘన్పూర్ అధ్యక్షులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దారి మరమ్మతులకు విరాళం అందజేత



నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలం లోని నెల్లుట్ల గ్రామంలోని ప్రధాన రహదారి సరిగా లేక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి విషయం తెలుసుకుని రహదారి మరమ్మతుల నిమిత్తం ఆదివారం రూ.21వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కొమ్మరాజుల కొమ్మరయ్య, దామెర మల్లేశ్, బీఆర్ఎస్ నాయకులు జున్నుతుల సుదీర్ రెడ్డి, వంగ సతీష్ దామెర మహేశ్, కొమ్మరాజుల గణేష్, శివరాత్రి సిద్దులు, నరేశ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



నవతెలంగాణ-కొడకండ్ల

మండలంలోని నరసింగాపురం గ్రామానికి చెందిన పనస భాస్కర్ కు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్ పాలకుర్తి నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు రాజేష్ నాయక్, నాయకులు, తదితరుల పాల్గొన్నారు.

ప్రతిభతో ఇన్నోవేటర్స్‌గా రాణించాలి

- **ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**



నవతెలంగాణ-జనగామ

ప్రతిభతో ఇన్నోవేటర్స్‌గా రాణించాలని జనగామ నియోజకవర్గ శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలోని శాసన సభ్యుల క్యాంపు కార్యాలయంలో ఇన్నోవేటర్ కో ఆర్డినేటర్ కల్యాణి ఆధ్వర్యంలో ఇన్నోవేటర్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్నోవేటర్ కోఆర్డినేటర్ జిల్లాలో చేపడుతున్న ప్రచార కలాపాలను అడిగి తెలుసుకున్నారు. చదువుతో ఎటువంటి సంబంధం లేకుండా తెలివితేటలు ప్రాతిపదికగా సృజనాత్మకతతో కొత్త అంశాలను వెలుగులోకి తెచ్చేందుకు ఇన్నోవేటర్ అవిష్కృతులుగా పేరొందాలని అన్నారు. జిల్లా కీర్తిని ఇనుమడింప జేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

సర్పంచ్ ఎన్నికల కోసం

అధికార పార్టీ శ్రేణుల ఎదురు చూపు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

దాదాపు దశాబ్ద కాలానికి పైగా ఎలాంటి పదవులు లేకుండా ఉన్న కాంగ్రెస్ లోని కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారా రంగంలో దిగుదామా అనుకుంటూ సర్వహంగులను సిద్ధం చేసుకుంటున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో గ్రామ స్థాయిలో ఏకైక ఉన్నత పదమైన సర్పంచ్ కోసం విపరీతమైన పోటీ ఏర్పడుతుంది. ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే శ్రేణులు సర్పంచులుగా పోటీ చేసేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. రిజర్వేషన్ లు యథాతథంగా గతంలో మాదిరిగానే కొనసాగుతాయని చెబుతుండడంతో ఒకింత నిరాశ పడ్డప్పటికీ ఆ రిజర్వేషన్ సామాజిక వర్గానికి చెందిన వారిలో ఇంతో అంతో ఆర్థికంగా కలిగిన వారు మాత్రం తమకు అందుబాటులో ఉన్న వనరులను సమకూర్చుకుంటున్నారు. నాయకులను కలుసుకొని అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వచ్చే ఆగస్టు లోనే సర్పంచ్ ఎన్నికలు ఉంటాయంటూ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ సందడి ప్రారంభమైంది. ముఖ్యంగా అధికార పార్టీలో నాయకులు, కార్యకర్తలు ఆ దిశలో చురుకుగా ముందుకు కదులుతున్నారు. జనగామ జిల్లాలో గతంలో అంతటా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే ఉంటుండేవారు. గత సంవత్సరం నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో పాలకుర్తి మినహా స్టేషన్ ఘన్పూర్, జన గామను బీఆర్ఎస్ అభ్యర్థులు కైవసం చేసుకు న్నారు. పాలకుర్తిలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలిచారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు నేపథ్యంలో స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరిపో యారు. ఆయన వెంట అధికార పార్టీలో భారీగానే చేరికలు కొనసాగాయి. జనగామ నియోజకవర్గంలో కూడా బీఆర్ఎస్‌లో కీలక పదవులు అనుభవించిన వారంతా ఇటీవలనే కాంగ్రెస్ పార్టీ బాట పట్టారు. దీంతో జిల్లా అంతటా కాంగ్రెస్ గాలే వీస్తోంది. అప్ప టికి కొన్ని దశాబ్దాలుగా పార్టీని నమ్ముకొని ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలతో పాటు ఇటీ వల బీఆర్ఎస్ తదితర పార్టీల నుండి వలస వచ్చిన వారికి ఏ విధంగా అవకాశం కల్పిస్తారోనని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

జనగామ నుండే మాజీ శాసనసభ్యులు కొమమ్మూరి ప్రతాప్ రెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. పార్టీని నమ్ముకొని ఉన్న వారిని, వలస వచ్చిన వారిని సమన్వయం చేయాల్సిన బాధ్యత ఆయన పైనే ఉంది. జనగామ నియోజకవర్గం రెండు జిల్లాలతో కూడుకొని ఉంది. జనగామ మండలం, పట్టణం, బచ్చన్నపేట, నర్మెట మండలాలు జనగామ జిల్లాలు ఉండగా చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాలు సిద్దిపేట జిల్లాలో ఉన్నాయి. కొమురవెల్లి, దూల్మిట్ట మండలాలు ఇటీవల జిల్లాల పునర్విభజన అనంతరం ఏర్పడినవే. 2009లో నియోజకవర్గాల పునర్విభజనకు ముందు చేర్యాల నియోజకవర్గం వరంగల్ జిల్లాలోనిదే. బచ్చన్నపేట నర్మెట మద్దూరు చేర్యాల మండలాలతో చేర్యాల నియోజకవర్గం మనుగడ సాగించేది. పునర్విభజనలో భాగంగా చేర్యాల పాత నియోజకవర్గం కనుమరుగైపోయింది. చేర్యాల నియోజకవర్గం పేరు మాత్రమే తెరమీద కనిపించకుండా పోయింది. కానీ నైసర్గికంగా యథాతథంగానే కొనసాగుతోంది. నియోజకవర్గానికి చేర్యాల పేరు మాత్రమే మాయమై జనగామ నియోజకవర్గంగా అవతరించింది. ఇందుకుగాను పాత చేర్యాల నియోజకవర్గ ప్రాంతానికి జనగామ మండలం, పట్టణం తోడైంది.

జీపీ కార్మికులకు గొడుగుల వితరణ



నవతెలంగాణ - స్టేషన్‌ఘనపూర్

కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిపాక సతీష్ కూతురు వర్షిణి జన్మదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ కార్మికులు, సిబ్బందికి గొడుగులు వితరణ చేశారు. ఏటా తన పిల్లల జన్మదిన వేడుకల భాగంగా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మంజుల, మాజీ వార్డు సభ్యులు కొలిపాక వేణు, ఎన్ఎస్‌యూఐ నియోజక వర్గ ఇన్‌చార్జి జానీ, వర్షిణి, ఈశ్వర్ ప్రసాద్, వినయ్, కుంభం రాజు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'యాదగిరి(నర్సిములు)'కి సన్మానం



నవతెలంగాణ-బచ్చన్నపేట

ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షులుగా మండలంలోని చిన్నరామన్ చెర్ల గ్రామానికి చెందిన మనుపటి యాదగిరి (నర్సిములు) ఎన్నికైన సందర్భంగా ఆదివారం మండల యూవజన నాయకులు కళ్లెం రమేష్ ఆధ్వర్యంలో గ్రామ శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. మాజీ సర్పంచ్ పిన్నింటి బాపు రెడ్డి హాజరై అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నిమ్మ కర్ణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బెజగం నరేష్ గ్రామ శాఖ యూత్ అధ్యక్షులు రామాగల్ల సంతోష్, కార్యకర్తలు కుండీ సిద్ధులు, గాదెపాక వెంకటనర్సయ్య, యవల్ల అంజన్ కుమార్, కంత్రి రాజు, తూర్కపల్లి భాను, నార్మట సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ ప్రెసిడెంట్‌గా మల్లారెడ్డి ఏకగ్రీవం



నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలం లోని బండ్లగూడెం గ్రామానికి చెందిన పోరెడ్డి మల్లారెడ్డి ని మండల కబడ్డీ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నా రు. రఘునాథపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కైలాష్ యాదయ్య(జిల్లా ఓలింప్ అసోసియేషన్ అధ్యక్షులు), అబ్సర్వర్ పి, యాదయ్య (తెలంగాణ కబాడీ అసోసియేషన్‌మెంబర్), కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పోగుల సారంగపని , స్టేట్ కబాడీ సెక్రటరీ తోటకూరి గట్టయ్య సమక్షంలో ఎన్నిక జరిగింది. మండల సెక్రటరీ గా బండ్రు శ్రీకాంత్, జిల్లా కార్యనిర్వణ కమిటీ సెక్రటరీగా తాటిపాముల రమేష్‌గౌడ్, మండల ఉపాధ్యక్షులుగా ఏలే శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కొడకండ్ల

మండలంలోని ఏడు నూతల గ్రామానికి చెందిన కొత్తపెల్లి మల్లయ్య అకాల మృతి చెందారు. ఆదివారం పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి, ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మండల సీనియర్ నాయకుడు కీసర సునీల్ రెడ్డి ఆయన భౌతిక గాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడంతో పాటు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వెలికట్ట వెంకన్న, నాయకులు కాసిం అంజయ్య, సైదులు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన యాదవ సంఘం కాటారం డివిజన్ నాయకుడు కుమార్‌యాదవ్

నవతెలంగాణ-మహదేవపూర్

హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆదివారం యాదవ సంఘం కాటారం డివిజన్ నాయకుడు కుమార్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. కాటారం లోని ఆదర్శనగర్ కాలనీని సమస్యలను శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చినట్టు ఆయన తెలిపారు. అనంతరం శ్రీధర్ బాబుకు ఆత్మకూరి కుమార్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
సోమవారం జులై 29, 2024
www.navatelangana.com

'మురళిచారి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు'



నవతెలంగాణ-మహబూబాబాద్

సీపీఐ(ఎం) నాయకులు మారోజు మురళిచారి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల రాజు అన్నారు. ఆదివారం స్థానిక గిరిప్రసాద్‌నగర్ కాలనీలో మారోజు మురళిచారి సంతాప సభ అధ్యక్షులు రావుల రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆకుల రాజు పాల్గొని మాట్లాడారు. పార్టీ క్రియాశీలక సభ్యునిగా ప్రతి పోరాటంలో మురళిచారి ముందుండేవాడని అన్నారు. చివరి శ్వాస విడిచే వరకు ఎర్రజెండా వెంటే నడిచాడని కొనియాడారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు సమ్మెట రాజమౌళి, టౌన్ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు హేమానాయక్, చీపిరి యాకన్న కుమ్మరికుంట నాగన్న, ఎర్ర శ్రీను, బానోత్ వెంకన్న, శాఖ కార్యదర్శి భానోత్ లింగన్న నల్ల మాస వెంకన్న, అరికల గణేష్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య



నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధి సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ మహబూబాద్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం మరిపెడ పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టలలో విద్యార్థుల సమస్యలపై సర్వే నిర్వహించారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని తెలిపారు. హాస్టల్‌లోని 15 మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయని, మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని కోరారు. హాస్టల్‌లో నీరు శుభ్రంగా లేదని, ట్యాంకులలో నాచు పెరిగి పోయిందన్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. హాస్టల్‌లో ప్రతివారం హెల్త్ క్యాంపులు నిర్వహించట్లేదని అన్నారు. హాస్టల్లో గ్రంథాలయాన్ని నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు చేయడం తెలిపారు. నోటుబుక్స్, దుస్తులు, బెడ్ షీట్, ప్లేట్లు, గ్లాసులు, కొత్త విద్యార్థులకు ఇవ్వలేదని, వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మరిపెడ పట్టణ నాయకులు గంగుల వెంకటేష్, పత్తిపాటి వినయ్, బాష్పంగు వికాస్, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ కమిటీ ఎన్నిక

సాంఘిక సంక్షసంక్షేమ హాస్టల్ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భూక్య వీరేందర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా వాంకుడోత్ హరికిషన్, కార్యదర్శిగా జరుపుల గణేష్, సహాయ కార్యదర్శిగా అజ్మీర సంతోష్, కోశాధికారిగా మున్సిపాలిటీ పట్టణానికి చెందిన జాటోత్ జగన్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులుగా 20మందిని ఎన్నుకున్నారు.

జీపీ కార్మిక సమస్యలు పరిష్కరించాలి

30న హైదరాబాద్‌లో ధర్నా : సీఐటీయూ



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

జీపీ కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు కోరారు. ఆదివారం కేసముద్రం స్టేషన్‌లోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు జాటోత్ మంగిలాలు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేండ్లుగా పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనాలు లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన మల్టీపర్పస్ విధానాన్ని తొలగించాలని, గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్ ,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టేకుల శ్రీనివాస్, బిర్రు కనకలక్ష్మి, లింగాడపు యాకయ్య ,కొంగర కవిత, తేళ్ల సుజాత, సగురం సుమలత, దుర్గం వెంకన్న, తేళ్ల సంజీవ, వంతడుపుల లలిత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వార్డు కౌన్సిలర్ స్రవంతి మృతి

పలువురు రాజకీయ నేతల సంతాపం





నవతెలంగాణ -మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ పట్టణ కేంద్రంలో నాలుగో వార్డు కౌన్సిలర్ మాచర్ల స్రవంతి అనారోగ్యంతో బాధపడుతూ ఆది వారం మృతిచెందింది. ఆమె మరణ వార్త విన్న పలువురు రాజకీయ నాయ కులు ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టులు పుర ప్రముఖులు వందలాదిగా తరలివచ్చి ఆమె పార్థి దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు సింధూర రవినాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఒంటికొమ్ము యు గంధర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్, బి ఆర్ఎస్ జిల్లా నాయకులు అచ్యుతరావు, మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్ కె అఫ్జల్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కుమారస్వామి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొని స్రవంతికి నివాళులర్పించారు.

బెల్లయ్యనాయక్‌కు సత్కారం

నవతెలంగాణ-నెల్లికుదురు

రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియముతులైన తేజవాత్ బెల్లయ్య నాయక్‌కు ఎల్‌హెచ్‌పిఎస్ మండల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించినట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ వీరన్ననాయక్ తెలిపారు. ఈ ప్రాంత వాసి బెల్లయ్య నాయక్‌కు కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అతనికి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించామని తెలిపారు. వారి వెంట ఎల్‌హెచ్‌పిఎస్ సీనియర్ నాయకులు గుగులోతు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-బయ్యారం

గిరిజన లంబాడీల ఆచార సాంప్రదాయ పండుగ అయిన తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించాలని గిరిజన సంఘ నాయ కులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని బాబు సార్ ఇంటి దగ్గర బంజారాలు తీజ్ పండుగపై సమీక్ష సమా వేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో గిరిజన పెద్దలు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆగస్టు 2న గోధుమలు నాన బెట్టుట, 11వ తేదీన తీజ్ నిమజ్జన కార్యక్రమం ఉంటుందని ఏకగ్రీవంగా కమిటీ తీర్మానం చేసినట్టు తెలిపారు. బంజారా మిత్రులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక విద్య మెరుగుపడేనా ?

ఏండ్ల తరబడి ఇన్‌చార్జి ఎంఈఓనే దిక్కు !



నవతెలంగాణ-తొర్రూరు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారుతోంది. ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు ఉండరు. విద్యార్థులు ఉంటే ఉపాధ్యాయులు ఉండని పరిస్థితి. ఒకే ఉపాధ్యాయుడితో ఐదు తరగతులు నిర్వహించడం, సదరు ఉపాధ్యాయుడు సెలవు పెట్టినా, విధుల్లో భాగంగా ఎక్కడికైనా వెళ్లిన పాఠశాల మూతపడాల్సిందే. ఇందుకు మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలమే నిదర్శనం.

మండలంలో 30 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉన్నాయి. ఇవి కాకుండా కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఇవన్నీ మండలకేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రం పరిధిలో ఉన్నాయి. కానీ, ఆకేంద్రను పట్టించుకునే వారు లేరు. సుమారు 15 ఏండ్లుగా ఎంఈఓ పోస్టు ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుగులోతు రాముకు తొర్రూరు, పెద్దవంగర, దంతాలపల్లి, నరసింహులపేట, నెల్లికుదురు మండలాలకు ఇన్‌చార్జి విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఐదు మండలాలకు



బాధ్యత అప్పగించడంతో ఆయన ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి ఉందని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. కనీసం మండలంలో ఉండే ఎవరికైనా సీనియర్ ప్రధానోపాధ్యాయుడికి బాధ్యతలు అప్పగిస్తే అందుబాటులో ఉంటాడని పేర్కొంటున్నారు. ఈ కార్యాలయంలో ఉన్నా కంప్యూటర్ ఆపరేటర్, అటెండరే అన్ని తామై వ్యవహరిస్తున్నారు. ఇక మండల విద్యా వనరుల కేంద్రంలో అనేక సమస్యలు తిష్టవేశాయి. అందుబాటులో ఉండాల్సిన మండల విద్యా ధికారి లేకపోవడంతో ఉపాధ్యాయులు తమ సమస్యలను, వినతులను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. తొర్రూరు డివిజన్ కేంద్రంలో డిప్యూటీ జిల్లా విద్యాధికారి స్థాయి అధికారి ఉండాల్సిన పరిస్థితిలో రెగ్యులర్ విద్యాధికారి కూడా లేడు. ఇక రెగ్యులర్ పోస్టులు లేవని, కాంట్రాక్టు పద్ధతిలోనే అందరూ పనిచేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలొస్తున్నాయి. మరోవైపై పేరుకే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఉన్నాయి. దీనికి తోడు అనేక ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. దీంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.

తొర్రూర్ మున్సిపల్ పరిధిలో..

తొర్రూరు మున్సిపల్ పరిధిలోని సోమల తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే లేరు. ఇక్కడ ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. అలాగే మండలంలోని టీకే తండా ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరం నలుగురు విద్యార్థులు ఉండేవారు. ఈ సంవత్సరం లేరు. ఇక్కడ ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. భోజియా తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేరు. ఇక్కడ ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. కర్రె పీకే తండా ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, కపూర్య తండా ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, వెలికట్టే ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇక మండలంలో కిష్టాపురం, దస్రు తండా, చంద్రు తండా, పెద్ద దుబ్బ తండా, ఎస్సీ కాలనీ వెంకటాపురం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా మూతబడి ఉన్నాయి. మండలంలో ప్రాథమిక విద్య బాగుపడాలంటే ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ తీసుకొని మండల విద్యాధికారిని నియమించి ప్రాథమిక విద్య బలోపేతానికి కషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలని 30న చలో హైదరాబాద్

- ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి

నవతెలంగాణ-మహబూబాబాద్



19 సంవత్సరాలుగా ప్రజానీకానికి వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జగన్నాథం భవనంలో జరిగిన ఆశా యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో దాదాపు 30వేల మంది ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతంలో గర్భిణీలు, బాలింతలు, పేదలకు వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారని తెలిపారు. కరోనా కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన ఆశాలకు నేటికీ ఫిక్స్ వేతనం అమలు చేయకపోవటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాలుగా సేవలందించిన ఆశాలకు మళ్లీ పరీక్షలు పెట్టే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2023లో ఆశాల 15 రోజుల సమ్మె సందర్భంగా , 2024 లో కమిషనరేట్ ముట్టడి కార్యక్రమం సందర్భంగా కమిషనర్ అంగీకరించిన హామీలను, ఆశాలకు కాంగ్రెస్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో ఆశాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

సీఐటీయూ అనుబంధ ఆశా యూనియన్ జిల్లా కమిటీని 33మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కుంట ఉపేందర్, అధ్యక్షులుగా మంకిడి రమణ, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ ఉపేంద్ర, కోశాధికారిగా కొప్పెర సుజిత ఉపాధ్యక్షులుగా విజయ, జ్యోతి, జయసుధ సహాయ కార్యదర్శులుగా శ్రీలత, రమణ, జ్యోతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోతుగంటి మల్లయ్య ఆశా యూనియన్ జిల్లా నాయకులు ఆసియా, ఉమాదేవి, చంద్రకళ, జయసుధ, సుజాత, సవిత, షమీన, నాగమణి, లక్ష్మి, స్వప్న, నీలిమ, స్వర్ణలత, స్వరూప, శకుంతల తదితరులు పాల్గొన్నారు.



'కార్పొరేషన్ చైర్మెన్' బెల్లయ్యనాయక్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-నెల్లికుదురు

రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన తేజావత్ బెల్లయ్యనాయక్‌ను ఘనంగా సత్కరించినట్లు వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు బాలాజీ నాయక్, జిల్లా నాయకుడు నాయని సత్యపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడ్డ వారికి గుర్తింపు ఇచ్చేదే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ ప్రాంత వాసి బెల్లయ్యనాయక్‌కు చైర్మన్ పదవి రావడం పట్ల హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ నెల్లికుదురు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్‌తోపాటు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-గార్ల

ద్విచక్ర వాహనానికి సంబంధించి ఫైనాన్స్ చెల్లించే విషయంలో భార్య తో గొడవ పడి గడ్డి మందు సేవించి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన విషాద సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై జీనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్న బంజార గ్రామానికి చెందిన బానోత్ శ్రీనివాస ఇదే మండలంలోని శేరిపురం పంచాయతీ చెవిటితండా కు చెందిన ధారావత్ సుమతిని వివాహం చేసుకోగా వారికి ఒక కూతురు ఉన్నారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న శ్రీనివాస్ తన భార్య తో ఫైనాన్స్ విషయంలో 25న గొడవపడి స్థానిక అప్ప సముద్రం చెరువు కట్టపై గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వైద్య నిమిత్తం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించి, మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు బానోత్ హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి : ఇల్లందు ఎమ్మెల్యే

నవతెలంగాణ-గార్ల



తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేస్తుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పుల్లూరు గ్రామంలో పుల్లూరు ప్రాథమిక సహకార సంఘం సభ్యత్వ కార్డులను ఆదివారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్క రికీ సంక్షేమ పథకాలను అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు, చేపల సొసైటీ చైర్మన్ జి కిషన్, కాంట్రాక్టర్ బానోత్ రవి, తదితరులు ఉన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం



- టిపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు

ఉద్యోగ విధులు నిర్వర్తించన ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి అన్నారు. స్థానిక లయన్స్ భవన్‌లో ఆదివారం ఉపాధ్యాయురాలు రాజసుకన్య ఉద్యోగ విరమణ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులంతా అంకిత భావంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల్ నోడల్ ఆఫీసర్ ఎమ్. బచ్చయ్య, టిపిటిఎఫ్ మహబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, విష్ణువర్ధన్ రెడ్డి, పూర్వ ప్రధాన కార్యదర్శి సూరం ఉపేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు వినోద్ రెడ్డి, సోమ గోవర్ధన్,జిల్లా బాధ్యులు కొలుపుల శ్రీనివాస్,ఉప్పలయ్య, రమేష్, ఐలయ్య, మండల బాధ్యులు ఎర్పుల సైదులు, హెచ్ఎంఏ నుండి వెంకటేశ్వర్లు, పిఆర్‌టియు నుండి సతీష్‌రెడ్డి, విప్లవరెడ్డి, ఎస్‌టియు నుండి సుధాకర చారి, చెంద్రమౌళి, టీజీ యుటిఎఫ్ నుండి నాగమల్లయ్య, టిపియుఎస్ నుండి రమేష్, డీటీఎఫ్ నుండి తిరుమలేష్, టియుటిఎఫ్ నుండి కిషన్‌నాయక్, సురేందర్, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం నుండి సోమి రెడ్డి పాల్గొన్నారు.



కంబాలపల్లిలో వైద్య శిబిరం

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని కంబాలపల్లి గ్రామంలో బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ క్యాంపులో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-గార్ల

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో అరకొర నిధులు మంజూరు చేసి విద్యారంగాన్ని విస్మరించిందని పిడిఎస్‌యు మండల కార్యదర్శి ఎం మహేష్‌కుమార్ అన్నారు. మండలంలోని మద్దివంచ గ్రామంలో ఆదివారం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయి, చింటు, వినయ్, పవన్ తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన కార్యదర్శికి ఘన సన్మానం



నవతెలంగాణ-నెల్లికుదురు

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఇక్కడ విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి కొచ్చర్ల వెంకటేశ్వర్లు, ఆయన సతీమణిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బీరవెల్లి యాదగిరి రెడ్డి, కారోబార్ రవి మాట్లాడుతూ... నెల్లికుదురు గ్రామానికి వెంకటేశ్వర్లు ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వహించి గ్రామ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. అలాంటి వ్యక్తి బదిలీపై వెళ్లడం బాధాకరం అన్నారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బంది అతనికి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

మాకు మేమే సాటి

పేద అందుడి కుటుంబానికి గృహం నిర్మించిన పోలీసులు

నవతెలంగాణ-మహబూబాబాద్

ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ సామాజిక రుగ్మతలను రూపు మాపడమే కాదు మానవీయ కోణాన్ని ఆవిష్కరించడంలో మాకు మేమే సాటి అని నిరూపిస్తున్నారు మానుకోట జిల్లా పోలీసులు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సుధీర్ రాంనాథ్ కేకన్ తన మార్కు చూపిస్తున్నాడు. జిల్లాలో గుడుంబా, నల్లబెల్లం, గంజాయి సాగు రవాణాపై ఉక్కు పాదం మోపుతూ అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నారు. ఇందులో భాగంగా నరసింహులపేట మండలం పెద్దనాగారం మండల కేంద్రంలో పేద అందుడి కుటుంబానికి గృహం నిర్మించిన పోలీసులు ఆదివారం ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ చేతుల మీదుగా అంధుడికి ఇల్లు ఇచ్చారు.



జిల్లాలో వివిధ పోలిస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల బారిన పడి అమాయక కుటుంబాలు రోడ్డున పడటంతో చలించిన ఎస్పీ రోడ్ల మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. దీన స్థితిలో ఉన్న రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, ఇతర సామాగ్రి, అటవీ ప్రాంత యువకులకు వాలీ బాల్, క్రికెట్ కిట్స్ అందివ్వడం లాంటి సామజిక కార్యక్రమాలు చేస్తు కమ్యూనిటీ పోలీసింగ్ చేస్తూ ద్వారా ప్రజలకు మరింత చేరువవుతూ మానవీయతను చాటుకుంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టిని కేంద్రీకరించే పోలీస్ బాస్‌కు నర్సింహుల పేట మండలం పెద్ద నాగారం గ్రామానికి చెందిన అంధత్వం గల వ్యక్తి దీనస్థితి గురించి స్థానిక ఎస్ఐ గంద్రతి సతీష్ ద్వారా తెలుసుకున్నారు. ఎస్పీ ఆదేశాలతో తన సిబ్బందితో కలిసి పెద్ద నాగారం గ్రామానికి చేరుకుని వ్యక్తి దీనస్థితి చూసి ఎస్ఐ చలించి తక్షణ సహాయంగా కొన్ని నిత్యావసర వస్తువులను అందించాడు. దీంతోపాటు బాధితుడికి ఉండటానికి ఇల్లు లేని విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇంటిని నిర్మించిచ్చే ప్రయత్నానికి శ్రీకారం చుట్టి తన వంతు సహాయం అందించారు. అలాగే నర్సింహుల పేట స్టేషన్ సిబ్బంది, కొంత మంది దాతలను ముందుకొచ్చేల చేసి ఇంటి నిర్మానాన్ని పూర్తి చేసారు. ఈక్రమంలో పెద్ద నాగారం గ్రామానికి ఎస్పీ చేరుకుని బాధిత కుటుంబ సభ్యులు చేస్తున్న గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. బాధిత కుటుంబానికి తమవంతు తమ సహకారం ఏళ్ల వేళలా ఉంటుందని భరోసా కల్పించారు.

'సకురా' రాష్ట్రస్థాయి పోటీలకు సాయిప్రియ ఎంపిక..

నవతెలంగాణ-సంగెం.



గవిచర్ల ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎలుకుర్తి సాయిప్రియ జపాన్‌లో జరగబోయే ఉన్నత పాఠశాలల సైన్స్ కార్యక్రమం 'సకురా' లో పాల్గొనే విద్యార్థుల ఎంపిక కోసం జిల్లాస్థాయిలో శనివారం నిర్వహించిన రాత, మౌఖిక పరీక్షలలో అర్హత సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రెహ్మాన్ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పరీక్షల్లో జిల్లాలోని కస్తూర్బా, ఆదర్శ, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ నెల 30న ఎస్‌సిఈఆర్‌టి హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచే విద్యార్థులు జపాన్ లో నిర్వహించే 'సకురా' సైన్సు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సంధ్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రెహ్మాన్, గైడ్ టీచర్ కె నీలాద్రి మరియు అధ్యాప బృందం విద్యార్థిని అభినందించారు.



బీసీ ముదిరాజ్ నాయకుల ఆరోపణపై ఖండన

నవతెలంగాణ-నర్సంపేట

దళిత సంఘాలపై బీసీ, ముదిరాజ్ సంఘాల నాయకుల ఆరోపణలను ఖండిస్తున్నట్లు సర్వే నెంబర్ 121 భూపోరాట సమితి కన్వీనర్ మంద ప్రకాష్, గనిపాక సంజీవ, బాణాల శ్రీనివాస్, మాదాసి రవిలు తెలిపారు. ఆదివారం అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో సర్వే నెంబర్ 121 భూపోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 121లోని ప్రభుత్వ అసైన్డ్ భూమిని రక్షించడానికి దళితులు పోరాటం చేసి జైల్ పాలై నష్టపోయారన్నారు. కొందరు సర్వే నెంబర్‌లను మార్పు చేసి రిజిస్ట్రేషన్ చేసుకొని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దళితుల నడుమ చిచ్చుపెట్టి అబాసుపాలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఆరోపణలు వెనక్కి తీసుకొని దళిత సంఘాల నాయకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బానాల రాంబాబు, వేల్పుగొండ రాజు, మాదాసి కృష్ణ, పసునూరి యశోద, మాదాసి భారతమ్మ, కంచర్ల మంగమ్మ, బొచ్చు వరమ్మ, గాదె ఇస్సాక్, గొల్కొండ సతీష్, పోగుల ప్రభుదాస్, మంద సుధాకర్, బానాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత.. ముగ్గురిపై కేసు నమోదు

నవతెలంగాణ- పర్వతగిరి



మండలం లోని అన్నారం షరీఫ్ లో గుడుంబా తయారీకి ఉపయోగించే 25 క్వింటాళ్ల నల్లబెల్లం,15 కిలోల పటిక తరలిస్తున్న టాటాఏసీ వాహనం సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్సై జి.వెంకన్న తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుడుంబా ను తయారు చేసే ముడిసరుకులను రవాణా చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై రవీందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పెద్ద రాజు, ఆశీర్వాదం, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట లోని ఫిరంగిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2006-2007 పదవతరగతికి బ్యాచ్ కు చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని వర్ధన్నపేట లోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా నాటి స్మృతులను నేటి మధుర జ్ఞాపకాలుగా గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. 17 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత పదవ తరగతి విద్యార్థులు ఒక చోట ఇలా కలుసుకోవడం పట్ల అందరికీ సంతోషాన్ని ఇచ్చిందని, ఒకరి కష్ట సుఖాలను మరొకరు చెప్పుకుని చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈసందర్భంగా గురువులు మాట్లాడుతూ జీవితంలో క్లాస్ పరీక్షలు రాసి పాస్ ఎలా అవుతామో.. జీవితం కూడా అనేక పాఠాలు నేర్పుతుంధని అన్నింటినీ తట్టుకొని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని జీవితం లో కూడా పాస్ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, నాగరాజు, శ్రుతి, కిరణ్, రంజిత్, చారి, రామ్ లక్ష్మణ్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..




నవతెలంగాణ-సంగెం.

మండలంలోని లోహిత గ్రామంలో జెడ్పీఎస్ఎస్‌హైస్కూల్ లో 1989-90 పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థినీ,విద్యార్థులు వారికి బోధించిన అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం లోహిత హైస్కూల్‌లో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. సరిగ్గా 34 సంవత్సరాల తరువాత వారంతా ఒక చోట ఒకరికొకరు యోగక్షేమాలు, కుటుంబ వివరాలను పంచుకున్నారు.నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా గడిపారు. విద్యార్థి దశలో చిలిపి చేష్టలు మరువకుండా మరొక్క మారు నెమరువేసుకున్నారు. ఆనాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు ప్రధానోపాధ్యాయులు శ్రీ రాంమూర్తి, ఉపాధ్యాయులు కుమారస్వామి, వీరస్వామి, భిక్షపతి, నర్సయ్య, దయామని, పుల్లారెడ్డి, రవీందర్, గురువులను సన్మానించి, శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు.సుమారు 40 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొని ముఖాల్లో వెలుగులు నిండాయి. సాయంత్రం వరకు తోటి స్నేహితులతో గడిపారు. మధుర జ్ఞాపకాలను తమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై హర్షం..

కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌ఛార్జ్ కట్టా శ్రీనివాస్

నవతెలంగాణ-పర్వతగిరి



రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వడం పట్ల పర్వతగిరి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ కట్ట శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. పర్వతగిరి మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు అందించి వారికి ఎంతో భరోసాను కల్పించిందన్నారు. ఇలాంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం నిరుపేదలకు ఒక వరం లాంటిదన్నారు. ఇలాంటి పథకం దేశంలోనే ఎక్కడాలేని విధంగా రైతు కూలీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని, రైతులు కాంగ్రెస్ పార్టీకి ఎంతో రుణపడి ఉంటారని ఆయన కొనియాడారు.

చిన్నారికి నాయకుల ఆశీర్వచనాలు..

నవతెలంగాణ-చెన్నారావుపేట



మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు జోరు వీరయ్య మనవడు విరాట్ మహా దేవ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని చిన్నారి విరాట్ మహా దేవ్ కి కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధన రమేష్‌లు పాల్గొని ఆదివారం చిన్నారికి ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్, మండల సీనియర్ నాయకుడు పోలేపల్లి భిక్షపతి, బొంత శ్రీనివాస్, కుండే కుమారస్వామి, మెంతుల రమేష్, గ్రామ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్క విజేందర్, నాని, భూక్య శ్రీనివాస్, సూత్ర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ ను వెంటనే అమలు చేయాలి



రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (స్టేట్ టీచర్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షులు ఎం.పర్వత రెడ్డి

నవతెలంగాణ-ములుగు

తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పర్వత రెడ్డి కోరారు. ఆదివారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయు) ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక కార్యకర్తలకు. సర్వీస్, లీవ్ రూల్స్, పెన్షన్ రూల్స్ పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు పర్వతరెడ్డి మాట్లాడుతూ ఎస్టీయూ సంఘం రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అనునిత్యం పోరాడుతూ 77 సంవత్సరాల సంఘ చరిత్ర కలిగివున్నదని తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ కై ప్రభుత్వం చొరవ తీసుకొని ఏంఇ ఓ, డిప్యూటీ డిఇఓ, డిఇఓ ప్రమోషన్లు, జూనియర్ లెక్చరర్ల ప్రమోషన్లు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని, సమగ్ర శిక్ష పరిధి లోని ఉద్యోగుల కు మినిమం టైం స్కేల్ వర్తింప జేస్తూ రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఏవీ సుధాకర్, జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏళ్ళ మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం క్రిష్ణయ్య, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు మంచర్ల వీరభద్రం, ప్రధాన కార్యదర్శి వంకుడోత్ రాంబాబు, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వం జన గణన చేయాలి.. రిజర్వేషన్లు ప్రకటించాలి..

సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్ల లింగయ్య పటేల్

నవతెలంగాణ-ములుగు



ప్రభుత్వం జన గణన చేసి, రిజర్వేషన్లు ప్రకటించాలని సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్ల లింగయ్య పటేల్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో కోరే రవి యాదవ్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటైన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగయ్య పటేల్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన కులాలకు రాజ్యాధికారం వస్తుందని భావించిన తెలంగాణ లో దళిత బహుజన వర్గాలకు అధికారం అనేది అందని ద్రాక్ష గా మారిందని ఆయన అవేదన వ్యక్తం చేశారు. 85 శాతం జనాభా కలిగిన దళిత బహుజనులు అధికారం అందకుండా అగ్రకులాల ఆధిపత్యంలో అణిచి వేయబడుచున్నారన్నారు. స్థానిక సంస్థల లోనైనా పోటీచేయాలనే ఆలోచనతో కొందరు ఎదురుచూస్తున్నపటికి కుల జన గణన చేయకుండా అణిచివేత దోరణి ప్రదర్శించడం దుర్మార్గ మైన చర్య గా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అణిచివేత దోరణి ప్రదర్శించడం మానుకొని కుల జన గణన చేసి సామాజిక న్యాయం పాటించాలని లింగయ్య పటేల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు శ్యామ్‌నాయక్, ఎమ్మార్పీఎస్ నాయకులు నటరాజ్ మాదిగ, ముస్లిం నాయకుడు రహమతుల్లా, ముదిరాజ్ సంఘం నాయకులు కె.లింగ స్వామి ముదిరాజ్, వడ్డెర సంఘం, యాదవ మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క పై చేసిన ఆరోపణలకు లారీ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదు

ములుగు తాలూకా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేములపల్లి రాజు

నవతెలంగాణ-ములుగు



మంత్రి సీతక్క పై చేసిన ఆరోపణలకు ములుగు తాలూకా లారీ అసోసియేషన్ వారికి ఎలాంటి సంబంధం లేదని ములుగు తాలూకా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేములపల్లి రాజు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సుంకర రంగరామకృష్ణ ,కోశాధికారి ఎస్కే గౌస్ లు పేర్కొన్నారు. మంగపేట చెంచులక్ష్మి ఇసుక సొసైటీ అధ్యక్షులు నరసింహ స్వామి ఇసుక సొసైటీ అధ్యక్షులు చేసిన ఆరోపణలను ములుగు తాలూకా అసోసియేషన్స్ కమిటీ వారు ఆదివారం తీవ్రంగా ఖండించారు. ములుగు జిల్లాలో ఉన్న రైతులకు, వాణిజ్య వ్యాపారవేత్తలకు ప్రజలకు మా సేవలు అందించడమే తప్ప ఎవరి మీద మేము ఆరోపణలు చేయబోమని అలాంటి తప్పుడు ఆరోపణలు చేయాల్సిన అవసరం కూడా మాకు లేదన్నారు. మంత్రి సీతక్క ని విమర్శించే స్థాయి మాది కాదనీ, తప్పుడు ప్రచారం చేయాల్సిన అవసరం కూడా మాకు లేదని ప్రజలు, ఇసుక సొసైటీల అధ్యక్షులు గమనించాలని కోరారు. మాపేరు చెప్పుకొని ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఎవరైనా మా పేరు చెప్పి తప్పుడు ప్రచారం చేస్తే మా దృష్టి తీసురావాలి కాని మా అసోసియేషన్ పై నిందలు మోపరాదని వారు తెలిపారు.



స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-నెక్కొండ

మండలంలోని రెడ్లవాడకు చెందిన 1998-99 బ్యాచ్ క్లాస్‌మేట్ మిత్రుడు చనిపోగా తోటి మిత్రులు ఆర్థిక సాయం చేసి ఆకుటుంబానికి అండగా ఉంటామని ధీమా కల్పించారు. రెడ్లవాడకు చెందిన గడ్డం సుధాకర్ ఇటీవల చనిపోగా మిత్రులందరూ కలిసి రూ.11వేలు ఆర్థిక సాయంగా మిత్రుని కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. ఆర్థిక సాయం అందించడంతోపాటు కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పిస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈకార్యక్రమంలో సుధాకర్ స్నేహితులు మాజీ ఉపసర్పంచ్ బర్ల వీరభద్రయ్య, వనం రాజు, పొనుగోటి కుమారస్వామి, జలగం శ్రీకాంత్, ఈదుల చంద్రశేఖర్, దుగ్గిరాల వెంకటేశ్, మామిండ్ల శ్యాంసుందర్, పరమేష్, నవీన్‌లు పాల్గొన్నారు.

సహాయక వంట మనుషుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఖానాపురం

మండలంలోని బుధరావుపేట గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో సహాయ వంటమనిషి పోస్టులను భర్తీ చేయడానికి అర్హత గల వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి రత్నమాల ఒక ప్రకటనలో తెలిపారు. సహాయక వంట మనిషి పోస్టుకి 7 వ తరగతి అర్హత కలిగి ఉండాలని,18 నుండి 45 సంవత్సరాలు మధ్య వయస్సు ఉన్న స్థానిక మహిళలు దరఖాస్తులను ఆయా మండల విద్యా వనరుల కేంద్రంలో 30 తేదీ లోగా సమర్పించాలని కోరారు. బుధరావుపేట లో 2 సహాయక వంట మనుషుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

నవతెలంగాణ -తాడ్వాయి

మండల కేంద్రంలో ఆదివారం తాడ్వాయి అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరోణ దినోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా ఎఫ్‌ఆర్‌ఓ షౌకత్ కత్ అలీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ షౌకత్ అలీ, హాస్టల్ వార్డెన్ మోకాళ్ళ లక్ష్మిలు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే మొక్కలు నాటడం, నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం అలవర్చుకోవాలన్నారు. భూమిపై ప్రతి జీవి బ్రతకాలంటే ప్రకృతిలో ఉన్న సహజ వనరులు గాలి, నేల, నీరు, మొక్కలు, ఖనిజాలు, సహజవాయువులు సమస్థితిలో ఉండాలన్నారు. జనాభా పెరుగుదల, అవగాహన లేని నిర్లక్ష్య వలన సహజ వనరులు తగ్గిపోవడంతో ప్రకృతిలో సమతుల్యత దెబ్బతినడం వల్ల కష్టాలు మొదలయ్యాయని అందుకే ప్రతి సంవత్సరం జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ మోకాళ్ళ లక్ష్మి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ లింగం, స్వరూప రాణి, బీట్ ఆఫీసర్లు పీరీల కార్తీక్, శరత్,రవి, రాజేష్, రాజు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ములుగు (వెంకట్లాపూర్)



వెంకటాపూర్ ఎంపీపీ బుర్ర రజిత అత్తమ్మ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుర్ర సమ్మయ్య గౌడ్ తల్లి బుర్ర లక్ష్మి (80) శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆదివారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ములుగు జిల్లా సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, వెంకటాపూర్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, కూరెళ్ల రామాచారి, ఇంచర్ల పిఎసిఎస్ చైర్మన్ చిక్కుల రాములు తదితరులు రామంజాపురం చేరుకొని లక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. లక్ష్మి మీతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అబ్బు వెంకట్ రెడ్డి మృతి బీఆర్ఎస్ కు తీరని లోటు

ములుగు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవిందు నాయక్

నవతెలంగాణ -తాడ్వాయి



బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్బు వెంకట్ రెడ్డి మృతి, బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ములుగు జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ పోరిక గోవింద నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అబ్బు వెంకట్ రెడ్డి దశదినకర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబానికి పార్టీ ఎలావేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల అధ్యక్షులు దండుగుల మల్లయ్య, ఉప సర్పంచ్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు బంగారు సాంబయ్య, మండల ఉపాధ్యక్షులు చల్లా రజినికర్ రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జి తుమ్మల రాజేందర్, పెండ్యాల దశరథం, చింతల మహిపాల్, చింతల కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



నవతెలంగాణ - శాయంపేట

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రాయరాకుల మొగిలి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు గడ్డం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మొగిలి పాల్గొని పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం వివిధ గ్రామాలలో మరణించిన పార్టీ సభ్యులకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి ఓటింగ్ శాతం పెరిగిందని, అదే స్ఫూర్తితో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ స్థానిక సంస్థలు ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి విజయ్, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి, నాయకులు విద్యాసాగర్, రమణారెడ్డి, సుమన్, రాజశేఖర్, చంద్రమౌళి, నవీన్, సాంబయ్య, సుధాకర్, రాజు, తిరుపతి, శ్రీనులు పాల్గొన్నారు.

హనుమకొండ



ఆశా వర్కర్లను విస్మరించిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్

నవతెలంగాణ-హనుమకొండ :

ఆశ వర్కర్లను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యేదాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో నాయిని రవి అధ్యక్షతన ఆశా వర్కర్ల సమావేశం జరిగింది . ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కేసీఆర్ ప్రభుత్వం చాలా గుర్తింపు ఇచ్చి రూ.పారితోషికం నుండీ 9900 ఇచ్చి గౌరవించింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన రూ 18వేలు ఇస్తామని మోసం చేసి 8నెలల నుండి పట్టించు కోవడం లేదని కనీసం వేతనం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగ కార్మిక లోకానికి ఇచ్చిన హామీలు, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చ కుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందన్నారు. రాబోయే కాలంలో అందరినీ ఏకం చేసి వారి సమస్యల పట్ల ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్టియు రాష్ట్ర అధ్యక్షుడు జి రాంబాబుయాదవ్, ఆశా రాష్ట్ర అధ్యక్షులు సంతోష, శివ కుమార్ రాష్ట్ర సలహాదారు, మంజుల, జి యువ రాజు, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చూపించాలి

నవతెలంగాణ-దామెర



దామెర భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు జంగిలి నాగరాజు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్గొండ పార్లమెంటరీ ప్రభావరి చాడ శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ దేశంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఇచ్చే నిధులు కేంద్రానివే అన్నారు. భారతీయ జనతా పార్టీ పరకాల నియోజకవర్గం లో బలంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చూపించాలన్నారు. దేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ విజయచందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంద ఐలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గురజాల శ్రీరామ్ రెడ్డి, రమణారెడ్డి, రాజకుమార్, పగడాల మధుకర్, పిట్టల రమేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: కేవీపీఎస్

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

బీసీ హాస్టల్ లోని విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా కార్యదర్శి మంద సంపత్ అన్నారు.కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంక్షేమ హాస్టల్ల సమస్యలపై సర్వేలో భాగంగా ఆదివారం కాజీపేట లోని బీసీ హాస్టల్ లో సమస్యలపై కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు ఈ సందర్భంగా మంద సంపత్ మాట్లాడుతూ హాస్టల్‌లోని సమస్యలు పరిష్కరించనిచో కెవిపిఎస్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈసర్వే కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య, నాయకులు సారంగపాణి, గణేష్, రమేష్, లింగన్న, అనిత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కేయుసి పోలీస్ స్టేషన్ పరిధిలో కాకతీయ పోలీస్ ఎస్సై రాజ్ కుమార్ సిబ్బంది ఆయినా ఎండీ. షబ్బీర్, శ్యామ్ రాజ్, రజిని కుమార్, సతీష్ కుమార్ లతో కలిసి ఓఆర్ ఆర్ మీదుగా రెడ్డీపురం రోడ్డు వైపు పెట్రోలింగ్ చేయుటకు వెళ్లగా పెగడపల్లి గ్రామం వద్ద చెట్ల పొదల మధ్యలో ముగ్గురు యువకులు కూర్చుని గంజాయి సేవిస్తున్నారు. వెంటనే ఆ ముగ్గురిని పోలీస్ వారు పట్టుకున్నారు. వెంటనే ఎస్సై రాజ్ కుమార్ ఆ ముగ్గురిని వారి వివరాలు అడగగా పుల్లూరి రాజేష్, పపావత్ అనిల్ , ఆలువాల విపిన్ కుమార్‌లుగా తెలిపారు. వారి వద్ద నుండి సుమారు 50గ్రాముల ఎండు గంజాయి, 2మొబైల్ ఫోన్లు స్వాదినం చేసుకుని కే యూ సి పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేను నా జీవన ప్రస్థానం గ్రంథం ఆవిష్కరణ

నవతెలంగాణ-నయీంనగర్

డా.వెంకటి తన అపారమైన అనుభవాన్ని రంగరించి రాసిన "నేను-నా జీవన ప్రస్థానం"గ్రంథాన్ని హనుమకొండలోని వడ్డెపల్లి రోడ్డులోని ఎలక్ట్రిసిటీ బిల్డింగ్ లో ఆదివారం రోజున కె.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ప్రెస్ అకాడమీ చేతుల మీదుగా ఆవిష్కరించారు .రేపటి తరాలు ఆదర్శంగా తీసుకునే విధంగా ఎన్నో విషయాలు ఈ పుస్తకంలో పొందుపరచబడ్డాయని పేర్కొన్నారు.ఆచార్య బన్న సభా అధ్యక్షునిగా వ్యవహరించారు. ప్రముఖ రచయిత్రి క్రీడాకారిణి అరుణ కీర్తి పతాక కరాదుల పుస్తక సమీక్ష చేశారు. పుస్తకంలోని కొన్ని సంఘటనలను ఆధారంగా ఒక గేయం వినిపించి సభికులను ఆకట్టుకున్నారు .ఆత్మీయ అతిథులుగా రిజా మనోహర్ బాబు, నెల్లుట్ల రమాదేవి, డి.నర్సయ్య, డా.వల్లంపట్ల నాగేశ్వరరావు, డా.హరినాథరావు, నిధి, మేధావులు, కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

పారాచూట్ ఆయిల్‌తో.. ఎంతో ప్రయోజనం..

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

వర్షాకాలం మండుతున్న వేడి నుండి ఒక రిఫ్రెష్ బ్రేక్ అందిస్తుందని పారాచూట్ అడ్వాన్స్డ్ అలోవెరా ఎన్‌రిచ్డ్ కోకోనట్ హెయిర్ ఆయిల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ఆహ్లాదకరమైన జల్లులు చల్లని గాలులు వేసవి తర్వాత స్వాగతించే ఉపశమనాన్ని అందిస్తాయి. అయినప్పటికీ, రుతుపవనాలు తేమను పెంచుతాయని వర్షపు నీటికి బహిర్గతం అవడం వల్ల ఇది జుట్టును దెబ్బతీస్తుందని తెలిపారు. గాలిలో అధిక తేమ వల్ల జుట్టు చిట్లిపోవడం, తెగిపోయే అవకాశం ఉందన్నారు. పారాచూట్ అడ్వాన్స్డ్ అలోవెరా ఎన్‌రిచ్డ్ కోకోనట్ హెయిర్ ఆయిల్ అనేది అలోవెరా, కొబ్బరి ఆధారిత హెయిర్ ఆయిల్ ప్రయోజనాలను మిళితం చేసి, చిట్లిపోవటాన్ని నియంత్రిస్తూ జుట్టును మృదువుగా చేయడంతో పాటు, వర్షాకాలంలో అత్యంత సాధారణ జుట్టు సమస్యలను ప్రభావవంతంగా పరిష్కరిస్తుందన్నారు. ఈమిశ్రమం జుట్టు లోపలి పది పొరల వరకు చొచ్చుకుపోయి జుట్టును మృదువుగా చేస్తుందన్నారు. ఈఆయిల్ ను జుట్టు కొనల వరకు సున్నితంగా మసాజ్ చేసి ముప్పై నిమిషాల తర్వాత కడిగేయాల ని తెలిపారు. ఈ వర్షాకాలంలో సింపుల్ అద్భుతమైన హెయిర్ కేర్ విధానంతో జుట్టుకు అవసరమైన పోషణను అందించుకోవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు.